




GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/53323

# సమయుజ్యోతి

ప్రతీ అక్షరం - ప్రజలకోసం

తెలుగు దిన పత్రిక

CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 141 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 ఆదివారం 10 ఆగస్టు 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్







## ఇండియా ఎవరి ముందూ
# తలవంచదు
## - కేంద్రమంత్రి పీయూశ్ గోయల్

**న్యూఢిల్లీ,ఆగస్ట్9సమయజ్యోతి**

సుంకాల పేరుతో లొంగదీసుకోవాలనుకుంటున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలను భారత్ సమర్థంగా తిప్పికొడుతోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు ఇప్పటికే 50 శాతం టారిఫ్స్ ట్రంప్ విధించగా, ఎవరి దగ్గర దిగుమతి చేసుకోవాలో అమెరికా నిర్దేశించలేదని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది. ఇప్పుడు ఇండియా ఎవరి ముందు తలవంచదని తేల్చిచెప్పింది. ట్రంప్?కు మరోసారి పరోక్షంగా గట్టి సమాధానం పంపింది! ఈ మేరకు ఇటీవల జరిగిన బిజినెస్ టుడే ఇండియాఏ100 సమ్మిట్‌లో పాల్గొన్న కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్, ఇండియా ఎవరి ముందు తలవంచదని వ్యాఖ్యానించారు. ప్రపంచ వాణిజ్య సమూహాలతో భారత్ భవిష్యత్తు సంబంధాలు చాలా బలంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నాయని తెలిపారు. ఏటా ఆరున్నర శాతం వృద్ధి చెందుతుందని, మరింత వేగవంతంగా వృద్ధి చెందడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.గత సంవత్సరం కంటే ఈ ఏడాది భారత్ ఎక్కువ ఎగుమతులు చేస్తుందనే నమ్మకం ఉందని తెలిపారు. వాణిజ్య అడ్డంకులను ఎదుర్కోవడానికి ఇప్పటికే చర్యలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.నాలుగు దేశా (యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్) కూటమితో జరిగిన చర్చలను గుర్తుచేసుకుంటూ, భారత్?ది నాలుగు ట్రిలియన్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలిపారు.

మిగతా 2లో

## 334 రాజకీయ పార్టీల
# గుర్తింపు రద్దు
### బీహార్ ఓట్ల రివిజన్‌ను
### సమర్థించుకున్న ఇసి

**న్యూఢిల్లీ,ఆగస్ట్9సమయజ్యోతి**

దేశంలో రాజకీయ పార్టీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం సవరించింది. గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగిం చింది. నిబంధనల ప్రకారం.. ఈసీ వద్ద నమోదైన రాజ కీయ పార్టీలు ఆరేళ్లలో కనీసం ఒక్క ఎన్నికలోనైనా పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పార్టీలు 2019 నుంచి ఒక్క ఎన్నికలోనూ బరిలోకి దిగకపోవడంతో వాటిపై ఈసీ వేటు- వేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 334 పార్టీలను జాబితా నుంచి

తొలగించినట్లు- ఎన్నికల సంఘం తెలిపింది. పేరుకు పార్టీలు పెట్టినప్పటికీ.. వీటికి భౌతికంగా ఎలాంటి కార్యాలయాలు అందుబాటులో లేవని వెల్లడించింది.

## రాహుల్‌గాంధీకి శరద్‌పవార్ మద్దతు

**ఢిల్లీ, ఆగస్టు 9సమయజ్యోతి**



మహారాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శరద్ పవార్ తాజాగా రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచారు. రాహుల్ గాంధీ ఇటీవల ఓ ప్రెజెంటేషన్ ద్వారా ఓట్ల దొంగతనం, ఫేక్ ఓటర్ల లిస్ట్ గురించి ప్రస్తావించారు. దీనిపై శరద్ పవార్ తనదైన శైలిలో స్పందించారు. ఈ విషయాన్ని భారత ఎన్నికల కమిషన్ సమగ్రంగా పరిశీలించాలని, ఇది చిన్న విషయం కాదన్నారు. వాటిలో కర్ణాటక, మహారాష్ట్రలలో ఎన్నికలు లేకపోయినా, దేశవ్యాప్తంగా పద్ధతిగా జరిగే ఎన్నికల మీద ఇలాంటి అంశా లు ప్రభావం చూపుతాయని ఆయన హెచ్చరించారు. రాహుల్ గాంధీ ఈ విషయాలను ప్రస్తావించే ముందు స్పష్టమైన అధ్యయనం చేశారని పవార్ పేర్కొన్నారు.

ఈ విషయాన్ని ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్

### రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం
### తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
### జిల్లాల కలెక్టర్లతో భట్టి విక్రమార్క సమీక్ష
### ఖాళీ స్థలాలను గుర్తించాలని ఆదేశం



**హైదరాబాద్,ఆగస్టు9సమయజ్యోతి**

సోలార్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గ్రామ పంచాయతీల నుంచి సెక్రటేరియట్ వరకు అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో శనివారం నాడు ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో భట్టి విక్రమార్క సమీక్షించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫారుకి, రెడ్కో సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు.

మిగతా 2లో

## మీ 10 ఏళ్ల అవినీతికి మేం రక్ష
# మా దోపిడీకి మీరు రక్ష

ఇదీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తీరు....

అందుకే అవినీతికి పాల్పడ్డారని తెలినా కేసీఆర్ కుటుంబంపై చర్యలు తీసుకోవడం లేదు

విద్యుత్ కొనుగోళ్ల కమిషన్ నివేదికను కేబినెట్ లో ఎందుకు చర్చించలేదు?

ఫోన్ ట్యాపింగ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ విచారణపై మాకు నమ్మకం లేదు


జడ్జీలను, సీఎం, కేంద్ర అధికారులను పిలిచి విచారించే స్థాయి సిట్ కు లేదు

సీబీఐ విచారణ కోరడానికి అనేక కారణాలున్నాయి

కేంద్రం నేరుగా జోక్యం చేసుకునే అవకాశమే ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది

కేటీఆర్ లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు

ఫోన్ ట్యాపింగ్ పై కుటుంబ సభ్యులతో కలిసి గుడిలో ప్రమాణం చేసే దమ్ముందా?



03 లో

# కావాలనే రిజర్వేషన్లపై బీజేపీ రాద్ధాంతం
### హైకోర్టు ఆదేశాలకనుగుణంగా స్థానిక ఎన్నికలు

**హైదరాబాద్,ఆగస్టు9సమయజ్యోతి**



బీసీల రిజర్వేషన్లపై బీజేపీ పార్టీ కావాలనే రాద్ధాంతం చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే స్థానిక ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని తమ ప్రభుత్వం ఎక్కడా పేర్కొనలేదని స్పష్టంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు బీజేపీ నేతలు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు కావాలనే బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో వారి సోదరులకు మంత్రి సీతక్క రాఖీ కట్టారు.

మిగతా 2లో

# ఆపరేషన్ సిందూర్‌లో ఐదు జెట్లను కూల్చేశాం
### - ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్

**ఢిల్లీ, ఆగస్టు 9సమయజ్యోతి**



ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్లను కూల్చేశామని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సాయంతో ఐదు పాకిస్తాన్ జెట్లను పేల్చిపడేశాము. ఐదు జెట్లను మాత్రమే కాకుండా.. ఓ భారీ 'ఎయిర్‌బర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్ క్రాఫ్ట్'ను కూడా కూల్చేశాము. రెండు వైమానిక స్థావరాలు ధ్వంసం చేశాం. మే 9, 10 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. మే 9వ తేదీ రాత్రి ఎక్కువగా ఉగ్ర శిబిరాలపై దాడులు చేశాం. డ్రోన్, ఎస్ 400 గగనతల రక్షణ వ్యవస్థ బాగా పనిచేసింది. వారి యుద్ధ విమానాలు భారత గగనతలంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నాం.

మిగతా 2లో

పాక్

# మేం లేకుండా శాంత చర్చలా?

## రష్యాతో ఎటువంటి రాజీలు చేయబోం

## ట్రంప్, పుతిన్ భేటీపై జెలెన్స్కీ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్9(సమయజ్యోతి):**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరగనున్న శిఖరాగ్ర సమావేశాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ శనివారం తీవ్రంగా వ్యతిరేకించారు. ఉక్రెయిన్ ప్రత్యక్ష ప్రమేయం లేకుండా కుదిరిన ఏదైనా ఒప్పందం అసమర్థమైనది, ప్రమాదకరమైనది అని అన్నారు. ఈ శుక్రవారం అలాస్కాలో జరగనున్న ఈ సమావేశం ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించే దిశగా ఒక సంభావ్య అడుగుగా అభివర్ణించబడుతోంది. అయితే అమెరికా, రష్యా మధ్య ద్వైపాక్షిక చర్చల ద్వారా మాత్రమే శాంతిని సాధించవచ్చనే భావనను జెలెన్స్కీ ఖండించారు.తన అధికారిక టెలిగ్రామ్ ఖాతాకు పోస్ట్ చేసిన సందేశంలో ఉక్రేనియన్ నాయకుడు తన రాజ్యాంగం ద్వారా రక్షించబడిన దేశ ప్రాదేశిక సార్వభౌమాధికారం చర్చలకు అర్హమైనది కాదని పునరుద్ఘాటించారు. ఉక్రెయిన్ రష్యాకు తాను చేసిన పనికి ఎటువంటి అవార్డులు ఇవ్వదు అని జెలెన్స్కీ అన్నారు. ఉక్రేనియన్లు తమ భూమిని ఆక్రమణదారునికి ఇవ్వరు. ఉక్రెయిన్ లేని ఏవైనా పరిష్కారాలు అదే సమయంలో శాంతికి వ్యతిరేకంగా పరిష్కారాలు. అవి ఏమీ తీసుకురాలేవు. ఇవి నిర్జీవ పరిష్కారాలు అవి ఎప్పటికీ పనిచేయవు అని పేర్కొన్నారు. జెలెన్స్కీ వ్యాఖ్యలు ఉక్రెయిన్, యూరప్‌లో పెరుగుతున్న ఆందోళనలను ప్రతిబింబిస్తున్నాయి. ఈ శిఖరాగ్ర సమావేశంలో ఉక్రెయిన్‌ను పక్కనపెట్టి శాంతి ప్రక్రియను ఉక్రెయిన్, యూరోపియన్ ప్రయోజనాల నుండి దూరం చేయగలదని ఆందోళన చెందుతున్నారు. జెలెన్స్కీతో సంప్రదించే ముందు పుతిన్‌తో కలవాలని ట్రంప్ తీసుకున్న నిర్ణయం ఆ ఆందోళనలను మరింత తీవ్రతరం చేసింది.

# ఆర్టీసీ నిర్వహణ నిమిత్తమే చార్జీల పెంపు

మొదటి పేజీ తరువాయి

**హైదరాబాద్,ఆగస్టు9సమయజ్యోతి**

రాఖీ పండుగకు చార్జీలు పెంచడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్టీసీ నిర్వహన కారణంగా కొంత చార్జీలు పెంచినట్టు తెలిపింది. పండుగ తరువాత రేట్లు యథాయథంగా ఉంటాయని వెల్లడించింది. ఈ నెల 11 వరకు స్పెషల్ బస్సుల్లో చార్జీలు పెంచినట్లు వెల్లడించింది. ఆ తర్వాత చార్జీలు సాధారణంగానే ఉంటాయని పేర్కొంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు లేకున్నా బస్సులను వెంటనే తిరిగి తీసుకురావాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో నిర్వహణ ఖర్చుల నిమిత్తం స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీలు పెంచామని వెల్లడించింది. 'సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, అనుబంధాలకు ప్రతికైనా రాఖీ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ప్రయాణికులకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా టీజీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రాఖీ పండుగకు నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే రూ.1.50 వరకు టికెట్ ధరలను సవరించింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యూలర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. ఈ నెల 11వ తేదీ వరకు నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఈ సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేసింది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో ప్రకారం స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను రాఖీ పండుగ సందర్భంగా సంస్థ సవరించింది. రాఖీ పౌర్ణమికి ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం సూచిస్తోంది. ఆర్టీసీ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సొంతూళ్లకు వెళ్లే వారు తమ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతూ.. అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తోంది.' అని తెలిపింది. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లలో రాఖీ పండుగ ప్రయాణికుల రద్దీ నెలకొంది. సికింద్రాబాద్ జేబీఎస్, ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్ బస్టాండ్లలో బస్సుల కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు.

# రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం

## ఇరు దేశాల భూభాగాల మార్పిడి ఉంటుంది

## శాంతి ఒప్పందం కుదురుతుందనే ఆశిస్తున్నా

## డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్9(సమయజ్యోతి):**

మూడున్నరేళ్లు గడిచినా రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడలేదు. ఈ యుద్ధాన్ని ఆపేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన వంతు ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ తో భేటీ అయ్యేందుకు సిద్ధమయ్యారు. తాజాగా ట్రంప్ ఒక ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందంలో భూభాగాల మార్పిడి కూడా ఉంటుందని చెప్పారు. తన 'ట్రూత్ సోషల్' ఖాతా ద్వారా ట్రంప్ స్పందిస్తూ... రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి ఒప్పందం కుదురుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా కొన్ని భూభాగాలు వెనక్కి తీసుకోవడం, కొన్ని భూభాగాలు మార్చుకోవడం జరుగుతుందని చెప్పారు. అయితే, ఏయే భూభాగాలు అనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. వాస్తవానికి ఈనెల 15న అలస్కా వేదికగా పుతిన్ తో భేటీ కానున్నట్టు ట్రంప్ తొలుత ప్రకటించారు. అయితే, దీనిపై రష్యా నుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో, తొలుత పుతిన్ తో ద్వైపాక్షిక భేటీ జరిపి కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పించాలని ట్రంప్ భావిస్తున్నట్టు సమాచారం.

# తెలంగాణ సీఎంగా బీసీ వ్యక్తి

## రేవంత్ తో మంచి అనుబంధం ఉంది

## విభేధాలు అనేవి తప్పుడు వార్తలు

## టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,ఆగస్టు9(సమయజ్యోతి):**



సీఎం రేవంత్ రెడ్డితో తనకు విభేదాలు ఉన్నాయని సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆ ప్రచారంలో నిజం లేదని... అవన్నీ తప్పుడు వార్తలని చెప్పారు. రేవంత్ కు, తనకు మధ్య మంచి అనుబంధం ఉందని తెలిపారు. తమ మధ్య ఉన్న సత్సంబంధాల వల్లే బీసీ రిజర్వేషన్లపై పోరాటం చేయగలిగామని చెప్పారు. బీజేపీ నేతలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్ ల మౌనం బీసీలకు అన్యాయం చేస్తుందని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి తెలంగాణ ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోస్యం చెప్పారు.

# సొంతూళ్లకు నగరవాసులు

## హైదరాబాద్-విజయవాడ ట్రాఫిక్ మాయం

## జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో వాహనాలు

## కిలోమీటర్ల మేరా బారులు తీరిన వాహనాలు

## తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

**హైదరాబాద్,ఆగస్టు9(సమయజ్యోతి):**

రాఖీ పౌర్ణమి పండగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకునేందుకు నగరవాసులు పెద్ద సంఖ్యలో సొంతూళ్లకు బయలుదేరడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. పండగ రద్దీ కారణంగా శనివారం ఉదయం నుంచే రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.హైదరాబాద్ నగర శివార్లలోని వనస్థలిపురం, భాగ్యలత, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఒక్కసారిగా వేల సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి రావడంతో ప్రధాన రహదారితో పాటు సర్వీసు రోడ్లు కూడా వాహనాలతో నిండిపోయాయి. కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. మరోవైపు, ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద కూడా ఇదే తరహా పరిస్థితి నెలకొంది. పండగ రద్దీ కారణంగా ఇక్కడ ట్రాఫిక్ దాదాపుగా స్తంభించిపోవడంతో, వాహనాలు ముందుకు కదలలేని దుస్థితి ఏర్పడింది. ఈ ఊహించని ట్రాఫిక్ జామ్ వల్ల గంటల తరబడి ప్రయాణం సాగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. తమ గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

# భారత్‌పై ద్వేషంతో ఆ దేశం 400 కోట్లు నష్టపోయింది

**ఢిల్లీ, ఆగస్టు 9సమయజ్యోతి**

పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ ఎన్నో నిర్ణయాలు తీసుకుని వాటిని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో పాకిస్థాన్ కూడా భారత్‌కు వ్యతిరేకంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంది. భారత్ విమానాలకు గగనతలాన్ని మూసేయడం ఆ వ్యతిరేక నిర్ణయాల్లో ఒకటి. అయితే పాకిస్థాన్ తీసుకున్న ఆ నిర్ణయం ఆ దేశానికి తీవ్ర నష్టం కలుగజేసింది. ఈ నిర్ణయం కారణంగా పాకిస్థాన్ రెండు నెలల్లోనే దాదాపు రూ.400 కోట్లు కోల్పోయింది. భారత్ నుంచి వచ్చే విమానాలను ఏప్రిల్ 24వ తేదీ నుంచి పాకిస్థాన్ తన గగనతలంలోకి అనుమతించడం లేదు. ఈ నిషేధం ఇప్పటికీ కొనసాగుతోంది. నిజానికి భారత్ నుంచి వెళ్లే అంతర్జాతీయ విమానాలు చాలా వరకు పాకిస్థాన్ గగనతలాన్ని వాడుకుంటాయి. పాక్ గగనతలం మీదుగా రోజుకు 100 నుంచి 150 భారతీయ విమానాలు ప్రయాణిస్తుంటాయి. ఇలా గగనతలాన్ని వాడుకున్నందుకు ఓవర్ ఫ్లైయింగ్ ఛార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క బోయింగ్ విమానం పాక్ గగనతలం మీదుగా ప్రయాణిస్తే దాదాపు 580 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. పాకిస్థాన్ గగనతలం మూసేయడంతో భారత్ విమానాలు వేరే మార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. దీంతో ఆ ఓవర్ ఫ్లైయింగ్ ఛార్జీలను పాకిస్థాన్ కోల్పోయింది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 20 మధ్యలో పాకిస్థాన్ ఎయిర్ పోర్ట్స్ అథారిటీకి రూ.410 కోట్ల నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని పాక్ రక్షణ మంత్రిత్వ శాఖ అక్కడి అసెంబ్లీలో వెల్లడించినట్లు డాన్ నివేదించింది. ఈ ఆంక్షల వల్ల పాకిస్థాన్ ఏడాదికి వేల కోట్ల రూపాయలను కోల్పోతుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

మొదటి పేజీ తరువాయి

# ఆపరేషన్ సిందూర్‌లో ఐదు జెట్లను కూల్చేశాం

వాటిని ఎంతో సమర్థవంతంగా కూల్చిపడేశాం. ఆపరేషన్ సింధూర్‌తో పాక్‌కు స్పష్టమైన సందేశమిచ్చాం' అని ఆయన అన్నారు. కాగా, ఏప్రిల్ 22వ తేదీన జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. అమాయక పర్యాటకులను కాల్చి చంపారు. 26 మందిని బలి తీసుకున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేసింది. దీంతో 100 మంది ఉగ్రవాదులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉగ్రవాదులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకోవటంతో పాక్ తట్టుకోలేకపోయింది. యుద్ధానికి దిగింది. యుద్ధంలో భారీ ఎత్తున నష్టపోయింది. చివరకు తోకముడిచింది.

మొదటి పేజీ తరువాయి

## ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్స్

అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్ కు పంపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ లో ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచి పంపిస్తామని చెప్పారు. కలెక్టరేట్లలో ఏమైనా మంచి డిజైన్లు ఉంటే కనుక వాటిని హైదరాబాద్ కు పంపాలని ఈ సందర్భంగా కలెక్టర్లకు ఆయన సూచించారు. గ్రామపంచాయతీ మొదలుకొని సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేస్తామన్నారు. వాటి ద్వారా పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపించారు. అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆఫీసుకి పంపాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై తెలంగాణ ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లను భట్టి విక్రమార్క ఆదేశించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలు సైతం పంపాలని కలెక్టర్లకు సూచించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ ఓ ఎఫ్ ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను పంపిణీ చేసింది. ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్లకు భట్టి విక్రమార్క వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించాం. ఈ ఆగస్టు నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలోప్రభుత్వం ఉంది. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

మొదటి పేజీ తరువాయి

# 334 రాజకీయ పార్టీల గుర్తింపు రద్దు

ఇప్పటివరకు దేశంలో 2,854 గుర్తింపుపొందని పార్టీలు ఈసీ వద్ద రిజిస్టర్ అయి ఉన్నాయి. తాజా చర్యతో ఆ సంఖ్య 2,520కి తగ్గింది. ఎన్నికల సంఘం వద్ద ఉన్న డేటా ప్రకారం.. ప్రస్తుతం దేశంలో ఆరు జాతీయ పార్టీలుగా కొనసాగుతున్నాయి. 67 ప్రాంతీయ రాజకీయ పార్టీలు మనుగడలో ఉన్నాయి. ఇదిలావుంటే బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు అధికారి పార్టీకి మద్దతుగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని.. 65 లక్షల ఓట్లను తొలగించిందంటూ విపక్ష పార్టీలు ఆరోపించాయి. పార్లమెంట్ వేదికగా ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలు చేపట్టాయి. అంతేకాకుండా ఇటీవల ఢిల్లీ వేదికగా రాహుల్‌గాంధీ ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఓట్ల కుట్రపై ప్రజెంటేషన్స్ ఇచ్చారు. తాజాగా ఇదే అంశంపై ఎన్నికల సంఘం స్పందించింది. బీహార్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై రాజకీయ పార్టీలు ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదులు గానీ అభ్యంతరాలు సమర్పించలేదని వెల్లడించింది. ఓటర్ల జాబితా ప్రకటించిన దగ్గర ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదని పేర్కొంది. జూలై 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. బీహార్‌లో జరుగుతున్న ఓట్ల ప్రత్యేక సర్వేపైనే సభలో ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రస్తుతం వాయిదాల పర్వం కొనసాగుతోంది. అయితే ఈ ఆరోపణలను ఈసీ ఖండించింది. అనర్హులైన ఓటర్ల పేర్లనే తొలగిస్తున్నట్లు- తెలిపింది.

మొదటి పేజీ తరువాయి

# రాహుల్‌గాంధీకి శరద్‌పవార్ మద్దతు

దీంతోపాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇండియాపై తిరిగి 25% నుంచి 50% వరకు దిగుమతి సుంకాలు పెంచే ప్రతిపాదన చేయడం పట్ల శరద్ పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారత్‌పై ఒత్తిడి తేవాలనే ప్రయత్నం అని ఆయన పేర్కొన్నారు. విదేశాంగ విధానాల్లో మన దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ఆయన స్వరం పెంచారు. పాకిస్తాన్ శత్రువులా మారింది, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకతో సంబంధాలు అంత మంచిగా లేవన్నారు. మనం ఈ సంబంధాలను మెరుగుపరచుకోవాలన్నారు. ప్రధాని మోదీ ఈ విషయాలను పట్టించుకోవాలని పవార్ హితవు పలికారు. అజిత్ పవార్‌తో శరద్ పవార్ కలిసి కనిపించడం, ప్రత్యేకించి కుటుంబ వేడుకల్లో కలసి కనిపించడం రాజకీయంగా కొత్త చర్చకు తావిచ్చింది. ఇటీవల ముంబైలో జరిగిన యుగేంద్ర పవార్ నిశ్చితార్థ వేడుకలో శరద్ పవార్, అజిత్ పవార్ ఇద్దరూ కలిసి పాల్గొన్నారు. దీంతో శివసేన బీజేపీ కూటమికి శరద్ పవార్ మద్దతు ఇవ్వబోతున్నారా? అనే చర్చ మొదలైంది. కానీ శరద్ పవార్ తన పాత ధోరణి గురించి స్పష్టం చేశారు. బీజేపీకి ఎప్పటికీ మద్దతు ఇవ్వనని, రాజకీయాల్లో తన సిద్ధాంతాలకే కట్టుబడి ఉంటానని మరోసారి గుర్తు చేశారు.

మొదటి పేజీ తరువాయి

## ఇండియా ఎవరి ముందూ తలవంచదు

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ మనదేనని తెలిపారు. భారత్?లో యువ శక్తి ఉందని అన్నారు. %జుఖీూ% దేశాలు భారత్?లో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టడానికి అంగీకరించాయని కేంద్రమంత్రి వెల్లడించారు. దీని ద్వారా 10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు, మొత్తం 50 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని తెలిపారు. అక్టోబర్ 1 నుంచి %జుఖీూ% ఒప్పందం అమలులోకి రానుందని ప్రకటించారు. అక్కడ నుంచి నాలుగు దేశాల మధ్య వాణిజ్యం మరింత సులువుగా మారుతుందని తెలిపారు. దేశాల టారిఫ్స్, సాంక్షన్స్ కారణంగా వాణిజ్యంలో డీ గ్లోబలైజేషన్ అవుతోందని వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. ఇండియా ఎగుమతులు, దిగుమతులపై ఎవరూ ప్రభావం చూపలేరని తెలిపారు. భారత్ ఎవరి మందు తలవొంచదని స్పష్టం చేశారు. దేశ కరెన్సీ, విదేశీ మారక నిల్వలు, స్టాక్ మార్కెట్లు బలంగా ఉన్నాయని తెలిపారు. సవాళ్ల సమయాల్లో భారత్ ఎల్లప్పుడూ విజయం సాధిస్తుందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వంటి ఉన్నత నాయకుడి నేతృత్వంలోని దేశం నేడు బలంగా, గౌరవంగా ఉందని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

**కావాలనే రిజర్వేషన్లపై బీజేపీ రాద్ధాంతం - పొన్నం ప్రభాకర్**

ఈ సందర్భంగా సీతక్కకు మంత్రి పొన్నం చీరను బహూకరించారు. సీతక్క నుంచి పొన్నం ప్రభాకర్ ఆశీర్వాదం తీసుకున్నారు. సీతక్కకు పొన్నం ప్రభాకర్ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాఖీ పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ రాఖీ కట్టారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సోదరి సీతక్క అంటూ ఆత్మీయంగా పలకరించి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుకి మంథని నియోజకవర్గ మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

# వైభవంగా వెంకటగిరి స్వామి కళ్యాణం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి కొత్తకోట

కొత్తకోట పట్టణ సమీపంలో వెంకటగిరి క్షేత్రం నందు వెలిసిన శ్రీ భూలక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణం వైభోగంగా నిర్వహించడం జరిగింది. పూజలు అనంతరం అమ్మవారికి మంత్రోచ్చరణల మధ్య మేళ తాళాలతో స్వామివారి కళ్యాణం పవిత్రమైన శ్రావణమాసం శ్రావణ నక్షత్రం పూన్నం అయిన శనివారం అయిన సందర్భంగా భక్తులు పోటెత్తి గోవిందుడి సేవలు వెంకటగిరి ఆలయం దైవ నామ స్మరణంతో ఆలయం మార్మోగి అంగరంగ వైభవంగా జరిగింది.శోభయమానంగా అలంకరించి కళ్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణోత్సవంలో జిలకర బెల్లం తదితర పూజలు అనంతరం అమ్మవారికి మంగళసూత్రధారణ జరిపించారు.స్వామి వారి జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రం రోజున వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయం అర్చకులు పట్టు వస్త్రాలతో అలంకరణ చేసి కళ్యాణ మండపంలో అర్చకుల పేద మంత్రాలతో కళ్యాణం వైభవంగా నిర్వహించారు. సింగరా ఆచార్యులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు.ఆలయ గర్భగుడి నుండి ఉత్సవ మూర్తి విగ్రహాలని కళ్యాణ మండపం వద్దకు తీసుకువచ్చి కళ్యాణం నిర్వహించిన తర్వాత పల్లకిలో కూర్చోబెట్టి పూజలు చేసి వెంకటేశ్వర స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు.స్వామి వారి భక్తులు పల్లకి సేవతో గోవింద నామస్మరణల మధ్య భుజాలపై పల్లకిని మోసుతు ఆలయం చుట్టూ భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యక్షణాలు చేస్తూ పల్లకి సేవలు వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుండి భక్తులు పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం లిచేయడం జరిగింది.ఈ కళ్యాణ కార్యక్రమంలో వేముల శ్రీనివాస్ రెడ్డి, బలిజేపల్లి శ్రీనివాసులు శెట్టి, దాబా శ్రీనివాస్ రెడ్డి, గంగు బాల్ రెడ్డి, బీమా బాలకృష్ణశెట్టి, వెంకటరమణశెట్టి, మొద్దు దామోదర్ రెడ్డి, సంద వెంకటేష్, జలంధర్ గౌడ్, నాయిని తిరుపతయ్య, అన్నదాత నీలేశ్ కుమార్, వెంకటేశ్వర్ రెడ్డి, గురు స్వామి, కృష్ణారెడ్డి, తదితరుల కుటుంబాలు కళ్యాణంలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహించారు.



# యాదవ సంఘ భవనా నిర్మాణానికి కృషి చేస్తా - ఆడే గజేందర్

సమయజ్యోతి న్యూస్ ఆగస్టు 09 బజార్ హత్నూర్

నేరడిగొండ మండలంలోని క్యాంప్ కార్యాలయంలో బజార్ హత్నూర్ మండలంలోని గిర్నూర్ యాదవ సంఘ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు ఈ సందర్భంగా వారు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలు ఆయన దృష్టికు తీసుకొచ్చారు, ముఖ్యంగా యాదవ సంఘ భవనా నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు, సానుకూలంగా స్పందించి ఆడే గజేందర్ త్వరలోనే సంఘ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో జక్కుల గంగయ్య ,గొల్లనాగు రమేష్ , బండివార్ మహేందర్, లక్కం నారాయణ , గొర్ల వెంకటేష్, రేఖ సతీష్ , గీసశ్రీనివాస్ , ఎల్కుసి శ్రీనివాస్, జంగిటి చంద్రశేఖర్ , గొల్ల నాగు లక్ష్మణ్, మేకల శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అక్కపెల్లి లక్ష్మణ్,ఎండి సద్దాం, పాల్గొన్నారు



# ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసి మహనీయులకి ఘనంగా నివాళి

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 09.

ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసి నాయకపోడ్ ఉద్యోగ సంఘం, నిర్మల్ జిల్లా అధ్యక్షులు ముచ్చిండ్ల రవికుమార్, ప్రధానకార్యదర్శి అనుగొండ సతీష్ కలిసి ఆదివాసి వీరులు కొమరంభీం, రాంజీ గౌడ్, భారత మహానాయకుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ, ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన వీరులను స్మరించుకోవడం ప్రతి తరానికి గర్వకారణమని, వారి త్యాగస్ఫూర్తి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఆదివాసుల ఆత్మగౌరవం, సంస్కృతి, హక్కుల పరిరక్షణ కోసం సంఘం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయక పోడ్ ఉద్యోగ సంఘ సభ్యులు కస్తూరి భీమేశ్వర్, సొండి శివశంకర్, బాపయ్య, గుండంపల్లి సాయన్న, గురుడు సునీల్, పోశెట్టి ముత్తన్న, బాలాజీ ,గంపల భూమేష్, రాజేశ్వర్, కాల శంకర్, పిరాజి, తదితరులు పాల్గొన్నారు.




# పాలమూరును అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్న ఎం. పి. డి. కె. అరుణమ్మ

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

మహబూబ్ నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణమ్మ ఎంపీ గా గెలిచి 14 నెలలు అయింది. తన పార్లమెంట్ పరిధి లో పాలమూరును అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ తన దైన శైలితో రాజకీయాన్ని పక్కన పెట్టి రాష్ట్రంలోని తన పార్లమెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే లను కలుపుకుంటూ పోతూ ముందుకు సాగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ 3.0 పాలనలో మన ఎంపీ డి.కె. అరుణమ్మ మహబూబ్ నగర్ కి ఏది కావాలో అది కేంద్రం పెద్దలతో చర్చించి ఇచిన మాట ప్రకారం హామీలు నెరవేరుస్తున్నది.1994 లో ఉమ్మడి మహబూబ్ నగర్ బిజినేపల్లి లో వట్టేం నవోదయ పాఠశాల రెండవది స్థాపించడం జరిగింది.అందులో భాగంగా 30 ఏళ్ళ తరువాత మళ్ళీ ఉమ్మడి పాలమూరు లోని బాలానగర్ మండలం లోని పెద్ద పల్లీ గ్రామంలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకి కేంద్ర పెద్దలతో మాట్లాడి విద్యాలయం ఏర్పాటుకి అనుమతులు వచ్చేలా కృషి చేసి ఎంతో మంది నిరుపేద విద్యార్థులకు(ఎలాంటి రాజకీయ సిఫారసు లేఖలు లేకుండా 100 శాతం నవోదయ విద్యాలయం అర్హత పరీక్ష ద్వారా ఎంపిక చేసి) విద్యానందించేందుకు తన వంతు కృషి చేసిన మన పాలమూరు జేజెమ్మ అరుణమ్మ కి ప్రజలు కృత్షతలు తెలిపారు.అతి త్వరలోనే నారాయణ పేట జిల్లా కి సైనిక్ స్కూల్ ఏర్పాటుకు అనుమతులు వచ్చేలా కృషి చేస్తున్నరని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



1/3

नवोदय विद्यालय समिति
शिक्षा मंत्रालय
(स्कूल शिक्षा एवं साक्षरता विभाग)
भारत सरकार
बी-१५, संस्थानिक क्षेत्र, सेक्टर-६२
नोएडा - २०१३०७ (उत्तरप्रदेश)
वेबसाइट - www.navodaya.gov.in

Navodaya Vidyalaya Samiti
Ministry of Education
(Dept. of School Education & Literac[y])
Government of India
B-15, Institutional Area, Sector-62
Noida - 201307 (Uttar Pradesh)
Website - www.navodaya.gov.in

F. No. 2-22/2024-NVS(GA)/Mahabubnagar/ | 285 Dated: 08.08.202[5]

To
The Chief Secretary,
Govt. of Telangana,
4F - 39, Dr. B. R. Ambedkar Telangana Secretariat,
Hyderabad, Telangana – 500022
cs@telangana.gov.in

Subject : Opening of Jawahar Navodaya Vidyalaya in Mahabubnagar District of Telangana State – reg.

Sir,

I am to convey the approval of the Hon'ble Union Minister of Education an[d] Chairperson, Navodaya Vidyalaya Samiti for establishment of Jawahar Navoday[a] Vidyalaya in Mahabubnagar district of Telangana State at the following place subject t[o] the conditions contained in this letter and also as per Inspection Report submitted b[y] the Site Selection Committee.

| Location of the Vidyalaya | | Name of the District |
|---|---|---|
| Permanent Site | | Mahabubnagar (Telangana) |
| Villages | : Peddapally, | |
| Post | : Balanagar, | |
| Tehsil | : Balanagar, | |
| District | : Mahabubnagar, | |
| State | : Telangana, | |
| PIN | : 509 202 | |
| Temporary Site | | |
| Building Name | : Durga Bhai Mahila Sishu Vikas Kendram Building, Old DRDO Office Complex, | |
| Village | : Bandamedipally, | |
| Post | : Mahabubnagar, | |
| Block | : Mahabubnagar, | |
| District | : Mahabubnagar, | |
| State | : Telangana, | |
| PIN | : 509 001 | |

2. The Jawahar Navodaya Vidyalaya is to be made functional from the Academic Session 2025 – 26 subject to transfer of proposed land for permanent site of JNV, in favour Navodaya Vidyalaya Samiti and after completion of necessary repair works at the offered temporary accommodation & providing the same, free of cost.

Continue to next page...

Page 1 of 3

# అమరచింతలో ఘనంగా రక్షాబంధన్.

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

అమరచింత మండల కేంద్రంలో రక్షాబంధన్ రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నా చెల్లెలు అక్క తమ్ముడు అనుబంధాలకు ప్రతిక రాఖీ పండుగ వేడుకలు వాడ, వాడ లో సోదరభవంతో ఘనంగా జరుపుకున్నారు. అమరచింత పట్టణంలోని జగన్ వాడ లో అన్నా మహంకాళి శశిధర్ కు చిన్నారి చెల్లెళ్ళు భవజ్ఞ ప్రియ రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.




# యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలో శనివారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తౌటు అరవింద్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. దీనిలో భాగంగా జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్ మైనార్టీ మండల ప్రెసిడెంట్ జావిద్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీలు తేజ సన్నీ యాదవ్, నాయకులు యూనిస్, కుమ్మరి గంగాధర్, కుంట సంతోష్ గౌడ్, నవీన్, కుందారం శీను, పద్మా రావు, మేక నగేష్, డి సాయన్న, విద్యాసాగర్, గడ్డం రవి, డిష్ వెంకటేష్, దయాకర్, పురుషోత్తం, హారి, కృష్ణ, గోపు ఉషన్న, మజార్, షేరు, గడ్డం రాము, తౌటు సన్నీ, పురుషోత్తం పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి కి రాఖీ కట్టిన కార్పొరేటర్ పుష్పానగేష్

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

స్వచ్ఛమైన ప్రజాపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి శనివారం ఆయన నివాసంలో రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపినట్లు రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్ పుష్పానగేష్ తెలియచేశారు రాఖీ కట్టిన కార్పొరేటర్ కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి ప్రజాసేవలో పునరంకితం కావాలని కార్పొరేటర్ ను కోరినట్లు ఆమె తెలియచేశారు ముఖ్యమంత్రి గా తెలంగాణా ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి పదికాలాల పాటు కొనసాగాలని కార్పొరేటర్ పుష్పానగేష్ అకాంక్షించారు ఆమె వెంట కుటుంబసభ్యులు ఉన్నారు



# ఎస్ హెచ్ పి ఎస్ జిల్లా కోఆర్డినేటర్ గా రాజేశ్వరరావు

సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో ఆగస్టు 09.

సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ ఛైర్మెన్ డా. బొమ్మరబోయిన కేశవులు ముదిరాజ్ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా కోఆర్డినేటర్ గా ఎస్.రాజేశ్వర్ రావు ను నియమిస్తూ సమాచార హక్కు పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. సంస్థ నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని బయటకు తీస్తూ సమాచార హక్కు చట్టం గురించి పౌరులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్.రాజేశ్వర్ రావు మాట్లాడుతూ, తమపై నమ్మకం ఉంచి గురుతర బాధ్యత అప్పగించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఎమ్మెల్యే గూడెం వారింట రాఖీ పండుగ వేడుకలు

సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం

సోదరి సోదరుల మధ్య అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ సంబరాలు గూడెం వారి ఇంట వెల్లి విరిశాయి రాఖీ పండుగ పురస్కరించుకొని శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నివాసానికి చేరుకున్న వారి సోదరీమణులు నర్సమ్మ సువర్ణలు ఎమ్మెల్యే జిఎంఆర్ తో పాటు మరో సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డిలకు రాఖీలు కట్టి తమ అనుబంధాన్ని చాటుకున్నారు వీరితోపాటు గూడెం మహిపాల్ రెడ్డి కుమార్తె కొలన్ రాజేశ్వరి రెడ్డి తమ సోదరుడు గూడెం విక్రం రెడ్డికి రాఖీ కట్టారు కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి కుమార్తె రుధిర గూడెం విక్రం రెడ్డి కుమార్తె మహిరలు వారి సోదరులు అక్షయ్ రెడ్డి నిహాన్ రెడ్డి లకు రాఖీలు కట్టారు కుటుంబమంతా రాఖీ పండుగ సంబరాలు నెలకొన్నాయి ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ అక్కా చెల్లెళ్ళు అక్క తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాల సూచికగా నిర్వహించుకునే గొప్ప పండుగ రాఖీ అని అన్నారు నియోజకవర్గంలోని ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు



GST NO: 36ACPPF9587L2ZM TELTEL/2013/5332
సమయజ్యోతి
ప్రతీ అక్షరం - ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక

## సంపాదకీయం

# గాలికొదిలేసిన గిరిజన సంక్షేమం

గిరిజనుల అభివృద్ధి విషయంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారయ్యింది. కనీస రహదారులు, వైద్యం, విద్య, మంచినీరు వంటి సదుపాయాలు నేటికీ గిరిజన గూడాల్లో కనిపించవు. ఆపదొస్తే డోలీలో మోసుకు ఆవడం ఇప్పటికీ ఈచూస్తున్నాం. ఇటీవల ఓ గర్భిణిని కాన్పు కోసం డోలీలో వర్షంలో తడుచుకుంటూ మోసుకొచ్చారు. అంటే ఇంకా మనం వారి అభివృద్ధి విషయంలో వెనకబడే ఉన్నామని చెప్పాలి. ఎపిలో పవన్ కళ్యాణ్ డిప్యూటి సిఎం అయ్యాక కొన్ని సమస్యలపై దృష్టి సారించారు. అందుకు ఆయనను అభినందించాల్సిందే. అలాగే తెలంగాణలో సీతక్క అడవిబిడ్డ కావడంతో వారి కష్టాలు తెలుసుకుని ముందుకు సాగుతున్నారు. తనవంతుగా వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అయితే మిగతా రాష్ట్రాల సంగతి పక్కన పెడితే తెలుగు రాష్ట్రాల్లో వారి జీవితాల్లో ఇంకా వెలుగులు నిండలేదు. ప్రభుత్వాలు చెబుతున్నంతగా అభివృద్ధి జరగడంలేదు. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1994లో ఐక్యరాజ్య సమితి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసీల దినోత్సవంగా ప్రకటించింది. ఏటా ఉత్సవాలు చేయడం, వారికి తాయిలాలు ప్రకటించడం తప్ప గట్టిగా చర్యలకు మాత్రం పూనుకోవడం లేదు. ప్రభుత్వాలు మారినా ఆదివాసీల పట్ల పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. నేటికీ వైద్యం అందుబాటులో లేదు. ప్రతి సంవత్సరం మలేరియా, –టైఫాయిడ్ వంటి విష జ్వరాలతో వందలాది మంది మరణిస్తున్నారు. ఆసుపత్రులు ఎన్ని ఉన్నా సరైన మందుల, వైద్యులు, ఇతర సిబ్బంది కొరత వెంటాడుతుంది. సరైన రహదారి సౌకర్యాలు లేక నేటికీ గిరిజనులు డోలీమోతతోనే ఆసుపత్రికి చేరుతున్నారు. కొన్ని సందర్భాల్లో సమయానికి వైద్యం అందక దారి మధ్యలోనే మరణిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో విద్య అందనంత దూరంలో ఉంది. ప్రతి సంవత్సరం ప్రభుత్వం గిరిజన సంక్షేమ శాఖ గురుకులాల్లో సీట్ల కోసం ఎదురుచూస్తూ ఉంటారు. అంతంత మాత్రమే సీట్లు ఉండడంతో చదువు మధ్యలోనే ఆగిపోతుంది. సంక్షేమ హాస్టళ్లల్లో సౌకర్యాలు లేమి, పౌష్టికాహారం లోపంతో పిల్లలు రక్తహీనతతో బాధపడుతున్నారు. చదువుకున్న విద్యార్థులకు సరైన ఉపాధి లేక రోజురోజుకూ నిరుద్యోగ సమస్య తీవ్రంగా తయారైంది. చదువుకున్న యువతీయువకులు వలసలు వెళ్తున్నారు. లక్షల కోట్ల రూపాయల విలువైన ఖనిజ సంపద ఉన్న ప్రకృతి మధ్యలో నిరుపేదలుగా జీవనం కొనసాగిస్తున్నారు. మనదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 8.6 శాతం ఆదివాసీలు ఉన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో వీరి సంఖ్య ఎక్కువగా ఉంది. అక్షరాస్యతతో పోలిస్తే గిరిజన ప్రాంతంలో అక్షరాస్యత అతి తక్కువ. మహిళ అక్షరాస్యత 34.67 శాతం. గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులు రాజ్యాంగం కల్పించింది. వీరి అభివృద్ధికి ప్రత్యేకమైన నిధులు, పరిపాలన వ్యవస్థ ఉండాలని రాజ్యాంగం లోని 5వ షెడ్యూల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ అమలు జరగడం లేదు. షెడ్యూల్ ప్రాంతానికి ఆనుకుని ఉన్న నాన్ షెడ్యూల్ మండలాల్లో వేలాదిమంది గిరిజనులు ఉన్నారు. వీరి గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతంలో కలపాలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్నా గిరిజన చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలు వర్తించడం లేదు. మెజార్టీ గిరిజనులు అడవిలో జీవిస్తున్నారు. విలువైన ఖనిజాలు కూడా వీరి నిర్వాసిత ప్రాంతాల్లో ఉన్నాయి. ఇంత విలువైన సంపదను గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఉపయోగించాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను బలహీనం చేసి, అటవీ భూమి, సహజ వనరులను బహుళజాతి, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారు. మనం ఎంతో అభివృద్ధి చెందామని భావిస్తున్న ఈ రోజుల్లో కూడా ఆదివాసీలు కనీస సౌకర్యాలు, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకు నోచుకోలేదు. ఆదివాసీలను భూముల నుండి దూరం చేసే కుట్రలు సాగుతున్నాయి. గిరిజనులకు రక్షణగా ఉన్న 1/70, అటవీ హక్కుల చట్టాలను ఒక్కొక్కదాన్ని నీరు గారుస్తున్నారు. అటవీ భూముల్ని సాగు చేసుకున్న వారికి అటవీహక్కుల చట్టం ప్రకారం 10 ఎకరాల వరకూ హక్కుపత్రాలు ఇవ్వాలి. కానీ గిరిజనుల సాగులో ఉన్న భూములకు నేటికీ పట్టాలు ఇవ్వడం లేదు. హక్కు పత్రాలు ఇచ్చిన అరెకరం, ఎకరం లోపునే ఎక్కువ మందికి ఇచ్చారు. అడవులను నమ్ముకుని బతుకుతున్న కోట్లాదిమంది బతుకు నాశనం చేసే నిర్ణయం కేంద్రం తీసుకొచ్చింది. గ్రామసభ అనుమతి లేకుండా అటవీ భూములను వివిధ ప్రాజెక్టులకు వినియోగించే పక్రియకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. అటవీ పరిరక్షణ నిబంధనలకి 2022లో నోటిఫైడ్ చేస్తూ కేంద్ర పర్యావరణ అటవీశాఖ ఆదేశాలు జారీ చేసింది. అడవుల్లో నివశించే గిరిజనుల అనుమతి అవసరం లేకుండా భూములు కేటాయింపు జరుగుతోంది. ఇది అత్యంత ప్రమాదకర మని ఇప్పటికే గిరిజన సంఘాలు, పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన దేశంలో అడవులను నమ్ముకుని కోట్లాదిమంది జీవిస్తున్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. నదీ జలాలన్నీ ఏజెన్సీల్లోనే ఉన్నాయి. కానీ ఆదివాసీలకు రక్షిత మంచినీరు అందుబాటులో లేదు. ఏజెన్సీ గ్రామాలకు సంపూర్ణంగా విద్యుత్ సదుపాయం లేదు.

## జిల్లాలోని విద్యాసంస్థల్లో జరిగిన అసభ్య సంఘటనలపై చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా

### ఇద్దరిపై ఫోక్సో కేసులు నమోదు

సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :



ఆదిలాబాద్ జిల్లాలోని రెండు విద్యా సంస్థలలో చోటుచేసుకున్న బాలలపై అసభ్య పర్వతనాలకు సంబంధించి జిల్లా కలెక్టర్ రాజర్షి షా రక్షణ చర్యలు తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ వివరాలను తెలియజేస్తూ తాంసి మండలంలోని జడ్పీ హైస్కూల్లో ఒక ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించి నట్లు సమాచారం అందిన నేపథ్యంలో అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయబడిందన్నారు. అలాగే ఆదిలాబాద్ స్పోర్ట్స్ స్కూల్లోని ఒక కోచ్ విద్యార్థిపై అసభ్యంగా ప్రవర్తించాడని బాధిత విద్యార్థి తల్లి ఫిర్యాదు మేరకు విచారణ జరిపిన అనంతరం ఆ కోచ్ పై కూడా ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, అతడిని విధుల నుండి తొలగించడం జరిగిందన్నారు. అదేవిధంగా తాంసీ పాఠశాల ఉపాధ్యాయుడిపై శాఖ పరమైన చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశామన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ అదివాసీ దినోత్సవం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ,ఆగస్టు 9

బాల్కొండ మండలంలోని ఇత్వార్ పేట్ గ్రామంలో శనివారం నాయక పోడు సంఘ నాయకులు కొమురం యువసేన ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.కొమరం భీం చిత్రపటానికి పూలమాలను వేసి ఘన నివాళులర్పించారు అనంతరం జెండా ఎగరవేశారు.ఆదివాసి హక్కులకై పోరాడిన అమరవీరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలొ నాయకపోడ్ సంఘ నాయకులు ధోని సాయితేజ,జువ్వన్న కొమురం భీం సంఘం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ భక్త మార్కండేయుని దేవాలయం లో రాఖీ పౌర్ణమి వేడుకలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.

అమరచింత పట్టణం లో శనివారం ఉదయం భక్త మార్కండేయుడు కి అభిషేకం చేశారు.వివాహం అయిన ప్రతి ఒక్క పద్మశాలియుడు రాఖీ పౌర్ణమి నాడు ప్రత్యేక పూజలు చేసిన జనీవారంను అనవాయితీగా ధరించారు. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు స్వీకరించారు.సాయంత్రం భక్త మార్కండేయుడు నీ తేరు ద్వారా మంగళ వాయిద్యాలతో.భక్తి పాటలతో పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. పెద్దలు లచ్చున్న.ఆలయ అధ్యక్షులు మహంకాళి విష్ణు, మహంకాళి ప్రభాకర్, కొంగరీ భాస్కర్.సిల్వరీ రాములు.పగడకుల చింతన్న తో పాటు చేనేత పట్టు చీరాల వ్యాపారి మహంకాళి శ్రీనివాసులు,క్యామ శ్రీను,మహంకాళి సత్యనారాయణ, సాంబారు సత్యం పద్మశాలి యూత్ తిరుమల నర్సింహులు,వెంకటేశ్, శ్రీకాంత్,చింతన్న, ఉషన్న,లడ్డు సత్యనారాయణ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## మార్కండేయ దేవాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ దేవాలయంలో శనివారము రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం అధ్యక్షులు తడుక బాలకిషన్ ఆధ్వర్యంలో వేద పండితులు హరీష్ శర్మ పంతులు, అర్చకులు ఆమంచి సత్యనారాయణ నేతృత్వంలో గాయత్రి హెూమం విశేష పూజలు, జంధ్యా ధారణలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. సంఘ ప్రతినిధులు గౌడ కృష్ణారి, మల్లేశం, సహదేవ్, బిట్ల వజ్రానందం, తాటిపాముల లక్ష్మీనారాయణ, తడుక ప్రభాకర్, దండె రామకిష్టయ్య, దోమల రాజేందర్ పాల్గొన్నారు.



## ప్రభుత్వ కార్యాలయాల పై యుద్ధ ప్రాతిపదికన సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, కలెక్టర్లతో వీసీ సమావేశం

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వ కార్యాలయాల పై యుద్ధ ప్రాతిపదికన సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఆయన శనివారం సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు పై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశానికి రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ సోలార్ విద్యుత్ వినియోగం, ఉత్పత్తి పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర క్యాబినెట్ విధానపరమైన నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల పై పూర్తి స్థాయిలో సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి రాష్ట్ర సెక్రెటరీ వరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయం పై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని, ప్రతి జిల్లా కలెక్టర్ తమ జిల్లా పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల వివరాలు, విద్యుత్ వినియోగం వివరాలు, వాటి పై సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలను వారం రోజులలో పంపాలని ఆదేశించారు. సోలార్ విద్యుత్




వినియోగంతో కరెంట్ బిల్లుల భారం తగ్గుతుందని వివరించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, విద్యా సంస్థల వివరాలు, అందుబాటులో ఉన్న ఖాళీ ప్రభుత్వ స్థలాల వివరాలను వారం రోజులలో పంపాలని అన్నారు. ఆర్వోఓఎఫ్ఆర్ చట్టం ప్రకారం గిరిజనులకు పంపిణీ చేసిన 6 లక్షల 17 వేల ఎకరాల్లో సోలార్ పంప్ సెట్ లో ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసు కుందని వెల్లడించారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్ భూములలో సోలార్ పంపు సెట్ల ఏర్పాటు ప్రక్రియ మూడు సంవత్సరాలలో పూర్తి చేయాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటుపై కలెక్టర్లు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ శేషాద్రి పాల్గొన్నారు.

# గడప గడపకు మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆత్మకూరు వనపర్తి జిల్లా.**

ఆత్మకూరు మండలంలోని మేడేపల్లి, జూరాల గ్రామంలో నిర్వహించడం జరిగింది కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిన నిధుల కరపత్రలు, కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి గ్రామ ప్రజలకు తెలియజేయడం జరిగింది.బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కమలాపురం రాము మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో దేశ రక్షణతో పాటు అన్ని రంగాల్లో భారతదేశం అభివృద్ధి చెందిందని గ్రామీణ ప్రాంతంలో కేంద్ర సంక్షేమ పథకాలు అమలు కావాలంటే రాబోయే స్థానిక ఎలక్షన్లో బిజెపి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామంలోని ప్రజలకు తెలియజేశారు. మండల అధ్యక్షుడు అశోక్ భూపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గం కో కన్వీనర్ రేచింతల శీను, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్ గౌడ్ మండల ఉపాధ్యక్షుడు పోలేల రాజు, కార్యదర్శులు, సాయికుమార్, నరేష్, మాజీ మండల అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు సహదేవుడు, బూత్ అధ్యక్షులు శంకర్ యాదవ్, శ్రీనివాసులు, జూరాల సాయి, మండల నాయకులు బాలరాజ్, మహేష్ నాయుడు, శివకుమార్, నాగరాజు తో కార్యకర్తలు పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ రక్షాబంధన్ వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

లయన్స్ క్లబ్ (మహిళా) బాల్కొండ ఫోర్ట్ ఆధ్వర్యంలో మహతి ఆశ్రమం, నచికేత ఆశ్రమం లో రక్షాబంధన్ వేడుకలు జరిపారు. పిల్లలకు రాఖీలు కట్టి, ఒకరినొకరు రాఖీ శుభాకాంక్షలు తెలిపి, పండ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సల్లగరిగే రాజేందర్, సెక్రెటరీ బోజన్న, ట్రేసరర్ భూస శ్రీనివాస్, సభ్యులు చౌటి కిషన్, భూస రత్నాకర్, అందె వెంకటగిరి, గొడికే శ్రీనివాస్, అల్లే నర్సయ్య, సుంకం శ్రీనివాస్ పాల్గొన్నారు.



# ఎరువుల కొరత లేకున్నా, దుష్ప్రచారం సరికాదు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

యూరియా కోసం మేము దుకాణానికి వెళ్తే కొందరు వ్యక్తులు వచ్చి మాతో బలవంతంగా మాట్లాడించి.. వీడియో తీశారు. ఎరువుల కొరత ఉందని, మిగతా విషయాలు చెప్పాలని ఒత్తిడి చేశారు. అవే వీడియోలు టీవీ ఛానెల్ లో ప్రసారం చేశారు. ఇక్కడ మాకు ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సాగులో ఎలాంటి ఇబ్బందులు రాకుంట చూసుకుంటున్నారు.. మాతో కావాలని మాట్లాడించి దుష్ప్రచారం చేయడం సరికాదంటూ పలువురు రైతులు రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో శనివారం తెలిపారు. రుద్రంగిలో ఎరువుల కొరత ఉందని గంటల తరబడి రైతులు వాటికోసం వేచి చూసి ఇబ్బంది పడుతున్నారని ఓ టీవీ ఛానల్ లో పలువురు రైతులు తమ అభిప్రాయాన్ని చెప్పినట్లు శుక్రవారం రాత్రి ప్రసారాలు చేశారు. కావాలనే ఓ మీడియా సంస్థ రైతులతో బలవంతంగా మాట్లాడించి.. వాటిని ప్రసారం చేసింది ఆ రైతులే శనివారం మీడియా ఎదుటకు వచ్చి తమతో కావాలనే మాట్లాడించారని స్పష్టం చేశారు. ఎరువుల కొరత ఉందని కావాలనే రెండు ఎలక్ట్రానిక్ మీడియాలలో సంస్థలో దుష్ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు.జిల్లాలో సాగుకు అనుగుణంగా అందుబాటులో యూరియా నిలువలు ఉంచామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సూచించారు. రుద్రంగి మండలంలో ఎరువుల కొరత లేదని, రైతులు సంయమనం పాటించాలని కోరారు.



# రైతు బీమాకు ఈనెల 14 నుంచి దరఖాస్తుల స్వీకరణ

## మండల వ్యవసాయ శాఖ అధికారి సుదర్శన్ గౌడ్

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ.... నారాయణపేట జిల్లా**



తెలంగాణ ప్రభుత్వం రైతుల యొక్క ప్రధాన కార్యక్రమాలలో ఒకటి రైతు భీమా పథకం,ఈ పథకం 8వ పాలసీ అనగా ఆగస్టు 14, 2025 నుండి ప్రారంభమవుతుంది అని మండల వ్యవసాయ శాఖ అధికారి సుదర్శన్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూభారతి పోర్టల్ నుండి జూన్ 05, 2025 నాటికి డిజిటల్ సంతకం చేయబడిన పట్టాదారుల డేటా కొత్త అర్హత కలిగిన రైతుల నమోదు కోసం పరిగణించబడుతుంది. అలాగే 18నుండి 59 సంవత్సరాల వయస్సు గల రైతులు అంటే 14.8.1966 నుండి 14.8.2007 మధ్య జన్మించారు. (రెండు రోజులు కూడా కలిపి) ఈ పథకం కింద పునరుద్ధరణ (రెన్యువల్ ) నమోదుకు అర్హులు అన్నారు.అంతేకాకుండా రైతు భీమా లో ఏదైనా మార్పులు చేయదల్సిన వారు ఆగస్టు 12 లోపల మీ అప్లికేషన్ ను మీ సంబంధిత ఏఈఓ కు అందచేయాలని కోరారు.మరియు కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం వచ్చిన వారు ఆగస్టు 13 అప్లికేషన్ తీసుకునుటకి చివరి తేదీ రైతు భీమా కొరకు పట్టాదారు పాస్ పుస్తకం, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు మరియు ఎన్రోల్మెంట్ ఫారం ను రైతు నింపి , స్వతహాగా వెళ్ళి మీ ఏఈఓ కు సమర్పించాలి (వాట్సాప్ లేదా ఇతర వ్యక్తుల ద్వారా పంపితే స్వీకరించబడదు) పుట్టిన తేదీ ఖచ్చితంగా ఆధార్ ప్రకారం పరిగణలోకి తీసుకోబడుతుంది అని తెలిపారు.

# ఇంటి స్లాబ్ పైన కూరగాయలు పూల తోట.

## ఆదర్శంగా నిలుస్తున్న సుకుమార్ పెట్కులే

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అదిలాబాద్**

నెల క్రితం మొదలు పెట్టారు. ఇంకా రెండే నెలలు ఓపిక పడితే సహజ సిద్ధ కూరగాయలు సిద్ధం. వర్షం లేనప్పుడు నీరు అందిస్తూ. వివిధ రకాల కూరగాయల పూల చెట్లు వంకాయలు, టమాటాలు, మిర్చి, బంతిపూలు వీటి కొరకు నాలుగు నెలలు బజారుకు వెళ్ళనవసరం లేదు. అని అంటున్నారు టీచర్స్ కాలనీకి చెందిన సుకుమార్ పేట్కులే. తన ఇంటి స్లాబ్ పైన నాలుగు వంకాయ చెట్లు, నాలుగు మిరప చెట్లు నాలుగు బంతి చెట్లు, నాలుగు టమాట చెట్లు పెట్టి నీటి యాజమాన్యం సమయనుసారంగా చేస్తున్నారు. ఇలా మూడు నెలలు కష్టపడితే అవి మనకు ఆరు నెలల పాటు పంట కూరగాయలు ఆకుకూరలు పూలు నందిస్తాయి అంటున్నారు. అంతేకాకుండా మెంతికూర, కొత్తిమీర మెంతికూర కూడా చెట్ల గ్యాప్ మధ్యన పెంచుతున్నారు. ఆర్గానిక్ పద్ధతుల ద్వారా ఇంట్లో పెరిగిన కూరగాయలు ఎంతో ఆరోగ్యంతో పాటు తాము తమ ఇంట్లోనే పండించామన్న మానసిక ఆనందాన్ని కలిగిస్తున్నాయని అంటారు సుకుమార్ పెట్కులే కుటుంబ సభ్యులు కల్పన, కార్తీక్, అంజలి పెట్కులే లు.పలువురు కాలనీ వాసులు పకృతి వాదులు సుకుమార్ పెత్కులే కుటుంబ సభ్యుల్ని అభినందిస్తున్నారు



# శ్రీ రంగనాథ స్వామి గిరి ప్రదక్షణ

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

శ్రావణ పౌర్ణమి పురస్కరించుకొని బాల్కొండ మండలం జలాల్ పూర్ గ్రామ శివారు కొండల్లో స్వయంభువుగా వెలసిన శ్రీ రంగనాథ స్వామివారి కొండచుట్టూ తొలచి, రహదారి ఏర్పాటు చేసి, తొలిసారిగా స్వామివారి గిరిప్రదక్షిణకు ఏర్పాట్లు నిర్వహించారు. అర్చకులు యతీంద్ర రాజుల వేణుగోపాల్, వేద పురోహితులు కృష్ణ చైతన్య ఆచార్యులు ఆధ్వర్యంలో ధ్వజస్థంభం వద్ద విష్వక్సేన సహిత, త్రి కలశ స్థాపన, బలిహరణం అనంతరం భక్తులతో గిరి ప్రదక్షిణ చేయించారు. ఆలయ, గ్రామ కమిటీ సభ్యులు, గ్రామప్రజలు, భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గిరిప్రదక్షిణ ఏర్పాటు చేసినందుకు భక్తులు హర్షం వ్యక్తం చేశారు.



# డిచ్పల్లి సీ.హెచ్.సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

## తహసీల్దార్ కార్యాలయం సందర్శన

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, ఆగస్టు 09 :**

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. శనివారం ఆయన డిచ్పల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, ఫిమేల్, జనరల్ వార్డులు, ల్యాబ్ తదితర విభాగాల పనితీరు పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని హితవు పలికారు. రౌండ్ ది క్లాక్ ఆసుపత్రులలో అన్ని సమయాలలో వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉండాలని ఆదేశించారు. ప్రతీ నెల రెండవ శనివారం ప్రత్యేకంగా నిర్వహించే ఆరోగ్యశ్రీ శిబిరానికి అన్ని విభాగాల స్పెషలిస్టు డాక్టర్లు హాజరయ్యేలా చూడాలని, పీ హెచ్ సీ లు, సీ హెచ్ సీల పనితీరును ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు.అనంతరం కలెక్టర్ డిచ్పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యల గురించి తహసీల్దార్ సతీష్ రెడ్డిని ఆరా తీశారు. త్వరితగతిన అర్జీలు పరిష్కరించాలని సూచించారు.



# శ్రీకృష్ణ మందిరంలో రక్షాబంధన్ వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలకేంద్రం శ్రీకృష్ణ మందిర్ లో శనివారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య వక్తగా ఆర్ఎస్ఎస్ జిల్లా సేవప్రముఖ్ మంతెన ప్రదీప్ పాల్గొని, రాఖి పౌర్ణమి విశిష్టతను తెలిపారు. సమాజంలో ఒకరికి ఒకరు చేదోడు, వాదోడుగా ఉంటూ నేను నీకు రక్ష, నీవు నాకు రక్ష మనందరం కలిసి దేశానికి ధర్మానికి రక్షగా ఉండాలి. ప్రపంచంలో హిందువులకు ఉన్నన్ని పండుగలు మరే మతస్తులకు లేవు. హిందూ అనేది మతం కాదని జీవన విధానం అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు నాగుల రాజేందర్ గౌడ్, గుమ్ముల విజయ్, అంబటి కిషన్, కత్రాజీ శ్రావణ్, స్వయం సేవకులు అంబటి నవీన్, కోడిచర్ల రామకృష్ణ, కుందారపు శ్రీనివాస్, సల్ల నర్సయ్య, దేవేందర్, రాజ్ గణేష్, బూసం సత్యనారాయణ, గణేష్, ఠాకూర్ రాము, ఆరెపల్లి రాజేశ్వర్ పాల్గొన్నారు.



# మేం లేకుండా శాంత చర్చలా?

## ట్రంప్, పుతిన్ భేటీపై జెలెన్స్కీ వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్9సమయజ్యోతి:**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరగనున్న శిఖరాగ్ర సమావేశాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ శనివారం తీవ్రంగా వ్యతిరేకించారు. ఉక్రెయిన్ ప్రత్యక్ష ప్రమేయం లేకుండా కుదిరిన ఏదైనా ఒప్పందం అసమర్థమైనది, ప్రమాదకరమైనది అని అన్నారు. ఈ శుక్రవారం అలాస్కాలో జరగనున్న ఈ సమావేశం ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించే దిశగా ఒక సంభావ్య అడుగుగా అభివర్ణించబడుతోంది. అయితే అమెరికా, రష్యా మధ్య ద్వైపాక్షిక చర్చల ద్వారా మాత్రమే శాంతిని సాధించవచ్చనే భావనను జెలెన్స్కీ ఖండించారు.తన అధికారిక టెలిగ్రామ్ ఖాతాకు పోస్ట్ చేసిన సందేశంలో ఉక్రేనియన్ నాయకుడు తన రాజ్యాంగం ద్వారా రక్షించబడిన దేశ ప్రాదేశిక సార్వభౌమాధికారం చర్చలకు అర్హమైనది కాదని పునరుద్ఘాటించారు.

# విస్తృత స్థాయిలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

### మంత్రి లక్ష్మణ్ కుమార్ తో కలిసి కలెక్టర్లతో వీ.సీ ద్వారా సమీక్ష జరిపిన డిప్యూటీ సీఎం

**సమయజ్యోతి న్యూస్ నిజామాబాద్, ఆగస్టు 09 :**

గ్రామ పంచాయతీ భవనం నుంచి మొదలుకుని రాష్ట్ర సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సూచించారు. రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధానపరమైన నిర్ణయం తీసుకుందని ఆయన వెల్లడించారు. శనివారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్.పీ.డీ.సీ.ఎల్ సీఎండి ముషారఫ్, రెడ్కో సీఎండీ.అనిలా తదితరులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అమలు, ఇరిగేషన్, దేవాదాయ తదితర శాఖల పరిధిలోని ఖాళీ భూములలో, అవకాశం ఉన్న అన్ని చోట్ల సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని
అన్ని జిల్లాల సమీకృత కార్యాలయాల భవనాలపై, పార్కింగ్, క్యాంటీన్ ల వద్ద సోలార్ యూనిట్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు రూపొందించి, ప్రభుత్వానికి పంపాలని సూచించారు.రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటుకు అనుకూలమైన డిజైన్లను హైదరాబాదు నుంచి ఎంపిక చేసి పంపిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయాల్లో సోలార్ యూనిట్లకు సంబంధించిన మంచి డిజైన్లు ఉంటే, వాటిని పంపాలని సూచించారు. అన్ని కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి నిర్ణీత ఫార్మాట్ పంపిస్తున్నామని, అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం రోజుల్లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రభుత్వ భవనాలతో పాటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, విశ్వ విద్యాలయాలు వంటి ఉన్నత విద్యా సంస్థల భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని, అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లకు సూచించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయని, వాటి వివరాలు సైతం పంపాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను ఆనాటి కాంగ్రెస్





ప్రభుత్వం పంపిణీ చేసిందని, ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం కలెక్టర్లకు వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించామని, ఈ నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని, దీనిని దృష్టిలో పెట్టుకొని జాప్యానికి తావు లేకుండా వారం రోజుల్లోపు వివరాలు పంపాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్డీఓ సాయాగౌడ్, టీజీ రెడ్కో డీ.ఎం రమణ, ట్రాన్స్కో ఎస్.ఈ రవీందర్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన గృహ ప్రవేశానికి హాజరైన మంత్రి వాకిటి శ్రీహరి

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ... నారాయణ పేట జిల్లా**

మండలంలోని గుడేబల్లూర్ (టైరోడ్డు) గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ వాకిటి నారాయణ నూతన గృహప్రవేశ కార్యక్రమానికి శనివారం తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, డైరీ అభివృద్ధి, క్రీడలు, యువజన సేవలు మరియు మత్స్యశాఖ మంత్రివర్యులు డా.వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.అనంతరం మాజీ ఎంపీటీసీ నారాయణ దంపతులను శాలువాతో సన్మానం చేశారు.



# సోదర-సోదరీమణుల బంధం ఈ రాఖీ బంధం

## రాఖీ పౌర్ణమి సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి కు రాఖీకట్టిన సోదరీమణులు

**సమయజ్యోతి న్యూస్ కృష్ణ..... నారాయణ పేట జిల్లా**

ప్రేమ, ఆప్యాయతలు, ప్రోత్సాహం %-% నా జీవితానికి మార్గదర్శకం అని మంత్రి శ్రీహరి అన్నారు.శనివారం రాఖీ పౌర్ణమి సందర్భంగా సోదర%-%సోదరీమణుల అనురాగ బంధాన్ని ప్రతిబింబించే విధంగా, తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ సోదరీమణులు చిన్ననాటి నుంచీ చూపిన ప్రేమ, ఆప్యాయతలు మరియు ప్రోత్సాహం తన వ్యక్తిగత ఎదుగుదలకు మార్గదర్శకంగా నిలిచాయని పేర్కొన్నారు. సోదర%-%సోదరీమణుల బంధం సమాజంలో స్నేహం, అనురాగం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే అమూల్యమైన సంప్రదాయమని ఆయన అన్నారు.మంత్రివర్యులు సోదరీమణులందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ,ఈ బంధం ఎల్లప్పుడూ మరింత బలపడాలని ఆకాంక్షించారు.



# ఆదివాసుల సంస్కృతి కాపాడటం అందరి బాధ్యత.

## - జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ఆదివాసుల సంస్కృతిని కాపాడటం అందరి బాధ్యత అని,ఆదివాసులందరూ అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా,జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా శనివారం రోజు జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చౌరస్తా వద్దగల కొమరం భీం,స్థానిక బస్టాండ్ వద్ద గల రాంజీ గోండు విగ్రహాలకు నివాళులర్పించారు.అనంతరం ఆదివాసులతో కలిసి సంప్రదాయ నృత్యంలో పాల్గొన్నారు.ఆదివాసుల సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా కృషి చేస్తామని వారు చెప్పారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు,రాజకీయ ప్రతినిధులు,జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆదిలాబాద్ లో ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**



యువ నాయకులను ప్రోత్సహించేందుకు ఆవిర్భవించిందే యువజన కాంగ్రెస్ అని అదిలాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అర్షత్ ఖాన్ అన్నారు.1960లో స్థాపించిన "యువజన కాంగ్రెస్" కి తొలి అధ్యక్షురాలిగా ఇందిరా గాంధీ పని చేసారన్నారు.శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనవాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవ భవన్ ఆవరణలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్ జెండాను ఆవిష్కరించారు.దేశ యువతకు నాయకత్వం,సామాజిక సేవ అలవరచే దిశగా యూత్ కాంగ్రెస్ పని చేస్తుందన్నారు.దేశాభివృద్ధికి యువత ముందుండాలని పిలుపునిచ్చారు.యువజన కాంగ్రెస్ దేశానికి ఎంతో మంది నేతలను అందించిందన్నారు.ప్రస్తుతమున్న ఎందరో ప్రజా ప్రతినిధులు ఒకప్పుడు యూత్ వింగ్ లో పని చేసిన వారేనన్నారు.నూతన యుగానికి యువజన కాంగ్రెస్ మార్గదర్శి గా పని చేస్తుందన్నారు.కార్యక్రమంలో అదిలాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు నాహీద్,అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రూపేష్ రెడ్డి,మండల అధ్యక్షుడు రాకేష్,యువజన కాంగ్రెస్ నాయకులు మగ్దూం అహ్మద్,గౌతమ్ రెడ్డి,తాహిర్ ఖాన్,రవి,ఉదయ్,మోసిన్ పటేల్,ఫెరోజ్,అయాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసి పోరాటాలను భావితరాలకు తెలియజేయాలి.

## - ఎమ్మెల్యే పాయల్ శంకర్

**సమయజ్యోతి న్యూస్ ఆదిలాబాద్ :**

ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఆదిమ గిరిజన కొలాం సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆదిలాబాద్ లోని టిటిడి కళ్యాణమండపంలో ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా ఆదివాసి వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల పోరాటాలు భావితరాలందరికీ తెలియజేయాలని,గ్రామాల్లో ఆదివాసి ఉద్యమ వీరుడు కొమరం సూర్, విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు.ప్రభుత్వాలు ఎన్నో మారుతున్నప్పటికీ ఆదివాసులకు రావలసిన ఫలాలు ఇంకా అందడం లేదన్నారు.కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆదివాసుల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తుందన్నారు.ఇల్లు లేని పివిటిజి లకు ఇల్లు మంజూరయ్యేలా రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తా అన్నారు.ఇప్పటికే 1089 మందికి ఇల్లు మంజూరు చేశామని గుర్తు చేశారు.సంఘం అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని హామీ ఇచ్చారు.కార్యక్రమం లో నాయకులు కొడప సోనే రావ్,మడావి గోవిందరావు,టేకం రాము, టేకం లక్ష్మణ్,గణపత్ రావ్,జంగు తదితరులు పాల్గొన్నారు.



# భక్త మార్కండేయ స్వామి దేవాలయం అధ్యక్షులుగా పారుపల్లి సత్యన్న.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

అమర చింత పట్టణంలోని భక్త మార్కండేయ స్వామి దేవాలయ ప్రతి సంవత్సరం మాదిరిగా 2025-26 కి నూతన కమిటీ ఎన్నిక జరిగింది.అధ్యక్షులుగా పారుపల్లి సత్యన్న, ఉపాధ్యక్షులుగా కొంగరీ భాస్కర్,ప్రధాన కార్యదర్శి జన్ను నాగరాజు,కోశాధికారి గా భావండ్ల గోపి,సభ్యులుగా బండారి శ్రీకాంత్, కాడు దాసు సతీష్,ఏనుగంటి రాజేందర్, మహంకాళి రఘు,చిన్ని సీతారాములు,సలహా కమిటీ సభ్యులుగా దేవరకొండ లచ్చన్న,పారుపల్లి చింతన్న,మహంకాళి ప్రభాకర్, మహంకాళి విష్ణు,తాటికొండ రమేష్ ఎన్నికయ్యారు.దేవాలయం అభివృద్ధికి కమిటీ సమిష్టి పూర్వకంగా పని చేయాలని కోరారు.అనంతరం ఆగస్టు 7న రాష్ట్ర చేనేత అవార్డు అందుకున్న దేవరకొండ లచ్చన్నని ఆలయ నూతన కమిటీ పద్మశాలియులు సన్మానం చేశారు.



# బాధిత కుటుంబాలను పరామర్శించిన ముత్యాల సునీల్ కుమార్

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

పడగల్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను శనివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ క్షేత్రస్థాయిలో పరామర్శించారు. కాంగ్రెస్ నాయకుడు వసంతరావుకు ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. ఆయనను పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. నల్ల రాజు నాన్నకు ఆపరేషన్ ద్వారా కాలును తొలగించడం జరిగింది. ఆయనను పరామర్శించి ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో రాఖీ పౌర్ణమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. అక్కాచెల్లెళ్లు అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టి ఆశీర్వదించారు. మండల కేంద్రంలోని మార్కండేయ మండలంలో పద్మశాలి కులస్తులు రాఖీ పౌర్ణమి వేడుకలను జరుపుకొని గాయత్రిలను ధరించారు. ఒకరికొకరు రాఖీలు కట్టుకొని నాకు నీవు రక్ష- నీకు నేను రక్ష మనిద్దరం దేశానికి రక్ష అని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



# నేడు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ పర్యటన



సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్, నియోజకవర్గంలో పర్యటించి పలు కార్యక్రమాలకు హాజరవ్వనున్నారు. ఉ.7 గంటల నుండి 9 గంటల వరకు మోర్తాడ్ ప్రజా నిలయంలో అందుబాటులో ఉంటారు. ఉదయం 9:30 గంటలకు వేల్పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దామోదర్ వాళ్ళ అమ్మ చనిపోవడంతో వారి అంత్యక్రియలలో పాల్గొంటారు. ఉదయం 11:30 ఆర్మూర్ మీనాక్షి కన్వెన్షన్ లో వివాహ కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్నం 12:00 గంటలకు పెర్కిట్ వెంకటేశ్వర గార్డెన్ లో బసంత్ రెడ్డి కూతురు వివాహానికి హాజరవుతారు. మధ్యాహ్నం 12:30 గంటలకు మోతె గ్రామంలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12:45 గంటలకు భీంగల్ సహస్ర ఫంక్షన్ హాల్ లో బబిత రెడ్డి వివాహ కార్యక్రమానికి హాజరవుతారు. మధ్యాహ్నం 1:15 గంటలకు ముచ్కూర్ గ్రామంలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 1:45 గంటలకు రాహత్ నగర్ గ్రామంలో పర్యటిస్తారు. సాయంత్రం 5:00 గంటలకు హైదరాబాద్ బయలుదేరి వెళ్తారు.

# రాజ్యాంగం మార్చాలన్న కుట్రలో బిజెపి

## క్విట్ బిజెపి నినాదంతో ముందుకు వెళ్లాల్సిందే

## గాంధీభవన క్విట్ఇండియా కార్యక్రమంలో పిసిసి చీఫ్

హైదరాబాద్,ఆగస్టు9సమయజ్యోతి:

రాజ్యాంగం మార్చాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బిజెపి చర్యలన్నీ ఈ కోవలో భాగంగానే సాగుతున్నాయని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండా ఎగరవేశారు. క్విట్ బిజెపి నినాదంతోనే దేశానికి రక్ష అన్నారు. అలాగే.. ఎలక్షన్ కమిషన్‌పై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఈ సమావేశంలో టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్య్ర ఉద్యమం ఏ విధంగా జరిగిందో నేటి యువత తెలుసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. 1942లో బ్రిటీ-ష్ పాలకులను తరిమి కొట్టాలని అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ క్విట్ ఇండియా ఉద్యమం కీలకమైనదని ఉద్ఘాటించారు. డూ ఆర్ డై నినాదంతో మహాత్మా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమం చేశారని కొనియాడారు. నేడు అధికారంలో ఉన్న బీజేపీ.. కాంగ్రెస్ చరిత్రను తుడిచివేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్.. నెహ్రూ, సర్దార్, సుభాష్ చంద్రబోస్ లాంటి నేతలను చరిత్రలో లేకుండా చేద్దామని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్వతంత్ర సంస్థలను వాడుకొని ప్రతిపక్షాలపై మోదీ ప్రభుత్వం కుట్ర పూరిత దాడి చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఎలక్షన్ కమిషన్.. బీజేపీ ఫ్రంటల్ ఆర్గనేషన్‌గా మారిందని ఆక్షేపించారు. ప్రశ్నిస్తే దేశ ద్రోహుల ముద్ర వేస్తున్నారని దుయ్యబట్టారు. క్విట్ బీజేపీ అంటేనే దేశానికి భవిష్యత్తు అని ఉద్ఘాటించారు. కులాలు, మతాల పేరిట బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలకు భవిష్యత్తు లేకుండా చేస్తోందని విమర్శించారు. దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో ఒక్కరంటే ఒక్కరూ కూడా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు లేరని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ దేశ స్వాతంత్య్ర కోసం ఉద్యమం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఈ దేశ రక్షణ కోసం పని చేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



# జడ్పీటిసి గెలుపు కోసం ఎత్తులు పైఎత్తులు

## పోలింగ్ కేంద్రాల మార్పుతో రాజకీయ రగడ

కడప,ఆగస్ట్9సమయజ్యోతి:

కడప జిల్లాలోని జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ట్విస్టులు మీద ట్విస్టులు వచ్చి చేరుతున్నాయి. జడ్పీటీసీ ఎన్నికలలో పోలింగ్ కేంద్రాల మార్పు రాజకీయ దుమారం రేపుతుంది. పోలింగ్ సమయం దగ్గర పడుతూ ఉండటంతో అన్ని పార్టీలు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పై దృష్టి సారించాయి.. దీంతో ఆ పార్టీలకు నిప్పులాంటి నిజాలు వెలుగు చూస్తున్నాయి.. గతంలో ఎన్నడూ లేని విధంగా అధికారులు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు.. దీంతో దాదాపు నాలుగు వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే పరిస్థితి ఇక్కడ నెలకొంది.. ఈ అంశంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ.. రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది.. జడ్పీటీసీ ఎన్నికల్లో గెలుపు కోసం రాజకీయ పార్టీలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి.. గత 25 సంవత్సరాలుగా ఎన్నడూ లేని సంస్కృతికి అధికారులు తెరలేరు.. దాదాపు ఆరు పోలింగ్ కేంద్రాలను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్పు చేయడంతో రాజకీయ దుమారం చెలరేగింది.. అధికార పార్టీ ఒత్తిడికి తలొగ్గి అధికారులు పోలింగ్ కేంద్రాలను మార్చారని ఎన్నికల కమిషన్ కు వైసీపీ ఫిర్యాదు చేసింది.. పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో 10,601 ఓట్లు ఉన్నాయి.. 4000 ఓట్లు- ఉన్న ఆరు పోలింగ్ కేంద్రాలను ఆ ప్రాంతాలలో కాకుండా మరో ప్రాంతానికి మార్చడమే ఇక్కడ సమస్యగా మారింది... పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో మొత్తం 15 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి... వీటిలో 6, 7, 8 ,9 ,10 ,11 పోలింగ్ కేంద్రాలను అధికారులు వేరే ప్రాంతాలకు మార్చారు... ఇంటి ప్రక్కనే పోలింగ్ కేంద్రం ఉన్న ఆ ఓటర్ మాత్రం తన ఓటును నాలుగు కిలోమీటర్ల వెళ్లి వేసుకోవాల్సిన దుస్థితి ఇక్కడ నెలకొంది.. ఇదే ఇప్పుడు వైసీపీకి చిర్రెత్తేలా చేసిందట.. ఓటమి భయంతో టీ-డీపీ అధికారులపై ఒత్తిడి తెచ్చిందని ఆరోపిస్తోంది.. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు రాకుండా చేయడం వల్ల పోలింగ్ బూత్‌లను ఆక్రమించుకొని సైక్లింగ్ లేదా రిగ్గింగ్ చేసుకోవాలని టీడీపీ భావిస్తున్నట్లు- కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆరోపించారు.గత 25 సంవత్సరాలుగా పులివెందుల నియోజకవర్గంలో ఉన్న పోలింగ్ కేంద్రాలను మార్చడం వల్ల దాదాపు నాలుగు వేల మంది ఓటర్లు ఫ్రీగా ఓటు- హక్కు వినియోగించుకోవడానికి వీలు లేకుండా పోయింది.. ఎర్రబెల్లి ఎంపీపీ స్కూల్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని నల్లపురెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్ కు మార్చారు. ఎర్రబెల్లి ఎలిమెంటరీ స్కూల్ లో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని, నల్లపురెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్ కు మార్చారు. నల్లగొండు వారి పల్లిలోని ఎలిమెంటరీ స్కూల్ లో ఉన్న పోలింగ్ బూతును, నల్లపురెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్ కు మార్చారు. నల్లపురెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్లో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఎర్రబెల్లి ఎలిమెంటరీ స్కూల్ కు మార్చారు. నల్లపురెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్లో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని ఎర్రబెల్లి ఎలిమెంటరీ స్కూల్ కు మార్చారు. నల్లపురెడ్డిపల్లి జడ్పీ హైస్కూల్లో ఉన్న పోలింగ్ కేంద్రాన్ని నల్లపురెడ్డిపల్లి ఎలిమెంటరీ స్కూల్ కు మార్చారు. దీంతో ఒక ప్రాంతంలోని వ్యక్తులు మరో ప్రాంతానికి వెళ్లి ఓటు- హక్కు వినియోగించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది.. పోలింగ్ కేంద్రాల మార్పుపై వైసీపీ తీవ్రంగా పరిగణించింది. ఈ అంశాన్ని ఎన్నికల కమిషన్ కు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేసింది. పోలింగ్ కేంద్రాల మార్పుతో ప్రభుత్వం పుట్ట పాల్పడుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆరోపించారు ఒక పోలింగ్ పరిధిలోకి వచ్చే ఓటర్లను మరో పోలింగ్ బూత్ కు మార్చడం ఏంటి అని ఆయన ప్రశ్నించారు.. ఇటీవల నల్ల గొండువారి పల్లెలో వైసీపీ నేతలపై హత్యాయత్నం జరిగిందని ఇటువంటి పరిస్థితులలో ఓటర్లు ఒక ఊరు నుంచి మరొక ఊరికి వెళ్లి ఓటు- హక్కును ఎలా వినియోగించుకుంటారని ఆయన ప్రశ్నించారు.. ఓటర్లకు భద్రత ఎవరు కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీ కార్యకర్తలపై దాడులు, కేసులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ ఉన్న సమయంలో , ఓటర్లను బదిలీ చేయడం మరో దుర్మార్గమైన చర్య అని ఆయన ఆరోపించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు- చేయాలని ఎన్నికల సంఘాన్ని కోరమన్నారు. అంతేకాకుండా కోర్టు దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకు వెళ్లినట్లు- ఆయన పేర్కొన్నారు..

# దేశంలో ఊపందుకున్న ట్రంప్ వ్యతిరేక ప్రచారం

## అమెరికా ఉత్పత్తులు బ్యాన్ చేయాలన్న డిమాండ్

## ఎక్స్ వేదికగా కోకాకోలా, పిజ్జా,కెఎఫ్‌సిల బహిష్కరణ ఉద్యమం

న్యూఢిల్లీ,ఆగస్ట్9సమయజ్యోతి:

ట్రంప్ తీరుపై ఆగ్రహంతో ఉన్న భారతీయులు ఆయనకు వ్యతిరేకంగా ఏకమవుతున్నారు. అమెరికా ఉత్పత్తులను నిషేధించాలన్న స్థాయికి ప్రచారం చేస్తున్నారు. ఇది ఒక భారత్‌లోనే కాదు...ప్రపంచ వ్యవప్తంగా వస్తోంది. ట్రంప్‌కు వ్యతిరేకంగా సొంత దేశంతో పాటు అంతటా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ట్రంప్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ఆన్‌లైన్ క్యాంపెయిన్లలో భాగస్వాములవుతున్నారు. 1500కు పైగా పోస్టులు 'ట్రంప్ ఈజ్ అన్‌ఫిట్ ఫర్ ఆఫీస్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో, 'అరెస్ట్ ట్రంప్' అనే హ్యాష్‌ట్యాగ్, కీలక పదాలతో కూడిన పోస్టులు 1900 ఉన్నాయి. దాదాపు 300 మంది నెటిజన్లు వ్యక్తిగత దూషణలు, అవమానపర్చే పదాలతో 3000కు పైగా పోస్టులు చేశారు. అమెరికా అధ్యక్షుడిని టార్గెట్ చేసుకుంటూ ఇలాంటి పదాలను వినియోగించే ధోరణి ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోయింది. అమెరికా ఉత్పత్తులు, వ్యాపారాలను బహిష్కరించాలంటూ భారత్ నుంచి విస్తృత స్థాయిలో పిలుపులు రావటం బహుశా ఇదే మొదటిసారి అని విశ్లేషకులు చెప్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిపై భారతీయుల్లో వ్యతిరేకత పెరిగిపోతున్నది. భారత్‌తో పాటు- ఇతర దేశాలపై ఎడాపెడా సుంకాలు విధిస్తున్న ఆయన తీరును వారు తప్పుబ డుతున్నారు. ఒకప్పుడు ట్రంప్‌నకు మద్దతిచ్చినవారు, అమెరికాకు ఆయనే మళ్లీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారు సైతం ఇప్పుడు ఆయన వద్దంటే వద్దు అని తెగేసి చెప్తున్నారు. ఈ మేరకు ఆన్‌లైన్ వేదికగా పలు సామాజిక మాధ్యమాల్లో ట్రంప్‌నకు, అమెరికా ఉత్పత్తులు, కంపెనీలకు వ్యతిరేకంగా ప్రచారం తీవ్రమైంది. అమెరికా కంపెనీలను బాయ్ కాట్ చేయాలని, ట్రంప్ చర్యలను ప్రతిఘటించాలని కొందరు భారతీయులు పిలుపునిస్తున్నారు. భారత్‌లో 'ఎక్స్' వేదికగా ట్రంప్ వ్యతిరేక వైఖరి పెరిగిపోయిందని గుర్తించింది. రష్యా నుంచి చమురు ఉత్పత్తుల కొనుగోలు చేస్తున్నదన్న కారణంతో భారత్‌పై ట్రంప్ ఇప్పటికే 25 శాతం సుంకాన్ని విధించారు. పెనాల్టీగా పేర్కొంటూ ఈనెల 28న మరో 25 శాతం టారిఫ్‌ను విధించేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమైన విషయం తెలిసిందే. తాజా విశ్లేషణ ప్రకారం.. భారత్‌పై ఆయన విధించిన టారిఫ్ పెరుగుదల భారతీయుల్లో ఈ ఆగ్రహానికి కారణమైంది. అమెరికా కంపెనీలను టార్గెట్ చేసుకుంటూ వాటిని బాయ్ కాట్ చేయాలన్న క్యాంపెయిన్ 'ఎక్స్'లో తీవ్రమైంది. అమెరికాకు చెందిన ప్రముఖ వ్యాపారాలే లక్ష్యంగా వేలాదిగా ఎక్స్ పోస్టులు వచ్చి పడుతున్నాయి. ఇందులో పది వేల వరకు పోస్టులు కోకా - కోలాను బ్యాన్ చేయాలన్నవే ఉన్నాయి. 9,100కు పైగా పోస్టులు మెటాకు చెందిన ప్రముఖ సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌ను టార్గెట్ చేసుకున్నాయి. స్టార్‌బక్స్‌ను బాయ్ కాట్ చేయాలని 5,200కు పైగా పోస్టులు డిమాండ్ చేశాయి. ఇక 2,700 పోస్టులు పిజ్జాహట్‌ను, ఐదువేలకు పైగా పోస్టులు కెఎఫ్‌సిని టార్గెట్ చేశాయి. కనీసం పదివేల పోస్టులు 'బాయ్‌కాట్ యుఎస్ఎ', 'బాయ్ కాట్ యుఎస్', 'బాయ్ కాట్ అమెరికా' అనే కీలక పదాలను కలిగి ఉన్నాయి. ట్రంప్ టారిఫ్ వార్‌పై భారత్ మాత్రమే కాదు.. ప్రపంచంలోని పలు దేశాలు సైతం ఇదే వైఖరిని అవలంభిస్తున్నాయి. ఈ ఆగ్రహం కెనడాలో మూడు నెలల క్రితమే ప్రారంభమైంది. అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టాలని నిర్ణయిం చుకున్నది. ఈ మేరకు అత్యంత ప్రాచుర్యం కలిగిన అమెరికానో కాఫీని 'కెనడియానో'గా పేరు మార్చింది. ఇటు- యూరప్‌లో సైతం అక్కడి వినియోగదారులు యూఎస్ అవలంబిస్తున్న విదేశాంగ విధానంపై కూడా ఇదే స్థాయిలో ఆగ్రహం వ్యక్తమవు తున్నది. సుంకాలతో గందరగోళం సృష్టిస్తున్న ట్రంప్ వ్యవహారం విషయంలో ఆయనకు చెందిన 'ట్రంప్ టవర్'పై చర్చ నడుస్తున్నది. ట్రంప్ విధిస్తున్న సుంకాలకు ప్రతిగా హైదరాబాద్ తో పాటు- గురుగ్రామ్, కోల్‌కతా, ముంబయి, పూణేలలో గల 'ట్రంప్ టవర్' రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో విలాస వంతమైన అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లపై భారీ పన్నులు విధించాలని పలువురు సోషల్ మీడియా యూజర్లు అభిప్రా యపడుతున్నారు.

# ధర్మస్థల వ్యవహారంలో కానరాని పురోగతి

## చూపిన చోటల్లా తవ్వుతున్నా బయటపడని ఆనవాళ్లు

బెంగళూరు,ఆగస్ట్9సమయజ్యోతి:

ధర్మస్థలలో సిట్ దర్యాప్తు ఒకవైపు, తవ్వకాలు మరోవైపు కొనసాగు తున్నాయి. అయితే ఆధారాలు పెద్దగా లభించడం లేదు. తవ్వకాలు, తమకు దొరికిన ఎముకలు, ఇతర అవశేషాలకు సంబంధించి సిట్ అధికారులు వివరాలను వెల్లడిం చకుండా గోప్యంగా ఉంచారు. తవ్వకాలు చేస్తున్న చోటు-కు ఉప్పు మూటల్ని తీసుకువెళుతున్నారు. దొరికిన వాటిని సంచుల్లో ఉంచుకుని, వాటికి తెల్లవస్త్రాన్ని చుట్టి తీసుకువెళుతున్నారు. బెళ్తంగడి సిట్ కార్యాలయానికి తీసుకువెళ్లి, అక్కడి నుంచి మణిపాల్ కేఎంసీకి పంపిస్తున్నారు. మణిపాల్ నుంచి బెంగళూరులోని ఫోరెన్సిక్ ప్రయోగశాలకు ఆయా సంచులను చేరవేస్తున్న ఘట్టం నిగూఢంగా సాగుతోంది. ధర్మస్థలలో సిట్ చేపట్టిన కార్యాచరణకు, తమకు సంబం ధాన్ని అంటగడుతూ కొన్ని ప్రచార మాధ్యమాలు, యూట్యూబర్లు చేస్తున్న ప్రచారాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆలయ ప్రముఖుడు హర్షేంద్రకుమార్ హెగ్గడే వేసుకున్న అర్జీని సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం తోసిపుచ్చింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను ప్రశ్నిస్తూ ధర్మస్థల కార్యదర్శి హర్షేంద్ర కుమార్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రచార మాధ్యమాలను నియంత్రించాలని పదేపదే న్యాయస్థానాలను ఆశ్రయించవలసిన అవసరం ఏముందని జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని పీఠం అనుమానాన్ని వ్యక్తం చేసింది. మీమ్‌లు, అభ్యంతరకరమైన అంశాలపై కర్ణాటక లోని న్యాయస్థానంలో అర్జీ వేసుకోవాలన్నారు. మీకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేయవలసిన అవసరం మాధ్యమ ప్రతినిధులకు ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. ఇకపోతే తాను వందలాది శవాలను పూడ్చి పెట్టానని ప్రకటించిన ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు భీమ సహకారంతో ప్రత్యేక దర్యాప్తు దళం సిట్ తవ్వకాలను కొనసాగిస్తోంది. అయితే అక్కడ పెద్దగా ఎలాంటి శవాల ఆనావాళ్లు కానరావడం లేదు. మొదట 13 ప్రాంతాలు, అనంతరం ఒక కొత్త ప్రదేశంతో పాటు, మరో మూడు ప్రాంతాలను ఆ వ్యక్తి చూపించాడు. వాటిలో మొదటి 12 ప్రాంతాల్లో తవ్వకాలు పూర్తిచేయగా, ఆరో ప్రాంతంలో మాత్రమే ఎముకలు లభించాయి. మరో చోట ఉరి వేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. 13వ ప్రాంతంలో తాను ఎనిమిదికిపైగా మృతదేహాలను పూడ్చి పెట్టానని ఆ వ్యక్తి చెప్పడం గమనార్హం. ఆ ప్రాంతాన్ని కాదని.. గురువారం కొత్తగా గుర్తించిన ప్రాంతంలో తవ్వకాలు చేపట్టినా ఏమీ లభించలేదు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భీమను సిట్ అధికారులు విచారించారు. అతను కొత్తగా చూపించిన మూడు ప్రాంతాల్లో ఒక చోట సాయంత్రం వరకు తవ్వారు. అయినా తాను మరో 30 ప్రాంతాలను చూపిస్తానని, అక్కడ తవ్వకాలు చేయాలని కోరాడు. జీపీఆర్ కోసం...: భీమ చూపించిన 13వ ప్రాంతంలో తవ్వకాలకు ముందస్తుగా జీపీఆర్ పరికరాన్ని వినియోగించి తవ్వకాలు కొనసాగించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం, జీపీఆర్ పరికరాన్ని బాడుగకు తీసుకోవలసిన అవసరం ఉండడంతో ఆ ప్రదేశంలో తవ్వకాలు సాగలేదు. ఎవరూ అక్కడకు రాకుండా సాయుధదళాన్ని భద్రతకు నియమించారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే జీపీఆర్ పరికరాన్ని బాడుగకు తీసుకుంటామని సిట్ అధికారి తెలిపారు. మొత్తంగా భీమ చెప్పిన ప్రాంతాల్లో ఎక్కడా బలమైన ఆధారాలు దొరకలేదు. దీంతో ఇప్పుడు భీమపై అనుమానాలు కూడా వస్తున్నాయి.

# క్విట్ ఇండియా దినోత్సవ జెండా ఆవిష్కరణ

మంచిర్యాల ఆగస్టు 09సమయజ్యోతి

:మంచిర్యాల పట్టణంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నివాస ప్రాంగణంలో క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా ఉద్యమ జెండాను పట్టణ అధ్యక్షులు తూముల నరేష్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమసాగర్ రావు జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అదేశాలతో జెండా ఆవిషరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి మాట్లాడుతూ 1942 ఆగస్టు 8 న బొంబాయిలో క్విట్ ఇండియా ఉద్యమాన్ని బ్రిటిష్ పాలకులను ఈ దేశం నుండి తరిమి కొట్టాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు .క్విట్ ఇండియా ఉద్యమానికి మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్, మౌలానా ఆజాద్, జవహర్లాల్ నెహ్రూలు నాయకత్వం వహించా రన్నారు. స్వతంత్ర పోరాటంలో ఆఖరి ఉద్యమం క్విట్ ఇండియా ఉద్యమమని దాంతోనే మన దేశానికి స్వతంత్రం వచ్చిందన్నారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో భారత దేశం కూడా బ్రిటన్ కి సహాయం చేస్తుంది అని బ్రిటిష్ ప్రభుత్వం చేసిన ప్రకటనను వ్యతిరేకిస్తూ మహాత్మా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించారన్నారు. నాడు బ్రిటిష్ పాలన ఏ విదంగా కొనసాగిందో అదే దిశగా నేడు భారత దేశంలో బిజెపి పాలన కొనసాగిస్తుందని మండిపడ్డరు.దేశంలోని వనరులను బ్రిటిష్ వారు దోచుకొని వెళ్ళిపోతే, రాజ్యాంగ హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి బీజేపీ కి ఎలాంటి సంబంధం లేదన్నారు. బీజేపీ మత విద్వేషాలు సృష్టించి దేశంలో అశాంతిని నేలకొల్పి తద్వారా మరోసారి అధికారంలోకి రావాలని మోడీ ఆలోచిస్తున్నారు.2029 ఎన్నికల్లో బీజేపీ కి ఓటమి తప్పదన్నారు. ఓట్ చోరి నినాదంతో రాహుల్ గాంధీ ఉద్యమాన్ని చేయాలన్నారు. రాహుల్ గాంధీకి కాంగ్రెస్ శ్రేణులు అండగా ఉన్నామన్నారు. ఈ దేశానికి రాహుల్ గాంధీ నాయకత్వం అవసరమని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ నస్పూర్ ఛైర్మెన్ సురిమిళ్ళ వేణు, మాజీ వైస్ ఛైర్మెన్ సల్ల మహేష్, లక్షెట్టిపేట్ టౌన్ అధ్యక్షులు ఆరిఫ్, నాయకులు రామగిరి బాణేష్, పుస్కూరి శ్రీనివాస్ రావు, ఖలీద్, ఒడ్డె రాజమౌళి, మోటపలుకుల గురువయ్య, సంజయ్ రావు, కిషన్, మల్లయ్య, నరిగె నరేష్, వెంకటేష్, తాజుద్దీన్, సాయి, రమేష్ నాయక్, జక్కుల కుమార్, రాజన్న, మల్లేష్, సత్యనారాయణ, కిష్టయ్య, తిరుపతి, శంకర్ రావు, మరియు మంచిర్యాల నియోజకవర్గ మాజీ ప్రజా ప్రతినిదులు, యువజన, బీసీ, ఎస్సి, మైనార్టీ, ఎన్ఎస్ యూ ఐ మరియు అనుబంధ సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొనగలరు.

మంచిర్యాలలో జెండా ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు





# ఉచిత కుట్టుమిషన్ కేంద్రం ప్రారంభం

కరీంనగర్ ఆగస్టు 08సమయజ్యోతి




కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని ఎల్బక గ్రామంలో గ్రామ స్వరాజ్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం సంస్థ జిల్లా కో - ఆర్డినేటర్ పుల్ల సుజాత ఆధ్వర్యంలో పీఏసీ చైర్మన్ మావురపు విజయ భాస్కర్ రెడ్డి ప్రారంభించారు ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచిత శిక్షణతో పాటు శిక్షణ అనంతరం సబ్సిడీపై నాణ్యమైన కుట్టుమిషన్ ను అందజేస్తామని తెలిపారు. ప్రతి గ్రామంలో నెలరోజులపాటు శిక్షణ ఉంటుందని తెలిపారు మొదటి బ్యాచ్ రెడ్డిపల్లి రెండవ బ్యాచ్ నర్సింగాపూర్ మూడో బ్యాచ్ ఎలబాక లో ప్రారంభించరు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మావురపు విజయభాస్కర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి ఐలోని యాదవ్, శిక్షకురాలు ఐరిని ఇందిరా,పిల్లి రవియాదవ్ తప్పేట రమేష్. ముదం రవి మహిళలు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ ఆగస్టు 08 సమయజ్యోతి:

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కొండపక గ్రామము మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషను కు తరలించారు.ప్రభుత్వం నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న కొండపక గ్రామనికి చెందిన నాగుల రాజు ,ఆవాల గిరిబాబు లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ ఐ ఆవుల తిరపతి తెలిపారు.అక్రమంగా ఇసుక రవాణ చేస్తే కటిన చర్యలు తిసుకుంటామని హెచ్చరించారు.

# యాంటీ ర్యాగింగ్ వీక్ పెట్టాల్సిందే

## మెడికల్ కళాశాలలకు ఎన్ఎంసీ ఆదేశాలు

హైదరాబాద్,ఆగస్టు9సమయజ్యోతి:



దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో ఆగస్టు 12 నుంచి ఆగస్టు 18 వరకు యాంటీ ర్యాగింగ్ వీక్‌ను పాటించాలని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తన పరిధిలోని అన్ని మెడికల్ కాలేజీలను కోరుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఆగస్టు 12వ తేదీని యాంటీ ర్యాగింగ్ డేగా అన్ని మెడికల్ కాలేజీల్లో సెలబ్రేట్ చేసుకోవాలని పేర్కొంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. యూజీసీ నిర్దేశించిన యాంటీ-ర్యాగింగ్ ఫ్రేమ్‌వర్క్ అమలులో భాగంగా దీనిని పాటించాలని తన నోటీసులో పేర్కొంది. ఈ నిబంధనలు తప్పనిసరని స్పష్టం చేసింది. అన్ని ఉన్నత విద్యా సంస్థలు ఈ నిబంధనలలో పేర్కొన్న పర్యవేక్షణ విధానాలుతో సహా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కూడా పేర్కొంది. యాంటీ-ర్యాగింగ్ వీక్ సందర్భంగా మెడికల్ కాలేజీల్లో పలు కార్యక లాపాలను నిర్వహించాలని యూజీసీ వివరించింది. ఈ సందర్భంగా యాంటీ-ర్యాగింగ్ వీక్ ప్రారంభోత్సవ కార్యక్ర మాలు, నినాదాలు రాయడం, వ్యాస రచన, పోస్టర్ తయారీ, ఫోటోగ్రఫీ పోటీలు, వీధి నాటకాలు, యాంటీ-ర్యాగింగ్ ఇతివృత్తాలపై డిబేట్స్ వంటి కార్యకలాపాలతో విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సూచించింది. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేసి, వారిని భాగస్వాములను చేయాలని తెలిపింది. డిజిటల్ పోస్టర్లు, షార్ట్ వీడియోలు, యాంటీ-ర్యాగింగ్ సందేశాలను హైలైట్ చేసే రీల్స్‌పై దృష్టి సారించేలా నేషనల్ కాంటెస్ట్ 2025 ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి కాలేజీలు, యూనివర్సిటీలు కృషి చేయాలని యూజీసీ ఆదేశించింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు యాంటీ-ర్యాగింగ్ పోర్టల్ అందుబాటులో ఉన్నాయి. విద్యా సంస్థలు డిజిటల్ ప్రచారం కూడా చేయవచ్చు. ర్యాగింగ్ వ్యతిరేక సందేశాలను ప్రోత్సహించే సంస్థల నుంచి వీడియో సందేశాలను వినియోగించవచ్చని వివరించింది. వర్క్‌షాప్‌లు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, సెల్ఫీ కార్నర్‌ల వంటి సృజనాత్మక మార్గాలు వంటి అవగాహన కార్యకలాపాలను క్యాంపస్‌లో ఏర్పాటు చేయాలని సూచించింది. ఆఫ్‌లైన్ కార్యకలాపాలతో పాటు విద్యార్థులు, అధ్యాపకుల కోసం విద్యా సంస్థలు యాంటీ- ర్యాగింగ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న షార్ట్ మువీలు, అవగాహన వీడియోలను ప్రదర్శించాలని సంస్థలకు సూచించింది.



# ముత్యాలమ్మ అలయ నిర్మాణానికి భూమి పూజా చేసిన కమిటీ సభ్యులు

హైదరాబాద్ సిటి ఆగస్టు 09 సమయజ్యోతి

:హైద్రాబాద్ ఎల్బీ నగర్ నియోజక వర్గం కొత్తపేట డివిజన్ మోహన్ నగర్ లో శనివారం ప్రజయ్ నివాస్ ఫేస్ 2 లో శ్రీ శ్రీ ముత్యాలమ్మ తల్లి అలయ నిర్మాణానికి కమిటీ సభ్యులు భూమి పూజా చేసి శంకుస్థాపన చేశారు.కాలనీవాసులు అమ్మవారి గుడి కట్టుకోవాలనే 25 సంవత్సరాల కల నెరవేరినందుకు హర్షం వ్యక్తం చెశారు. కాలని వాసులు అలయ నిర్మాణానికి విరాళాలు అందిస్తూ తమ భక్తిని చాటుకుంట్టున్నారు. ప్రతి ఒక్కరు ఆలయ నిర్మాణానికి తమవంతు విరళాలు వస్తు రూపేణా లేదా నగదు రూపంలో కమిటీ సభ్యులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొత్త తిరుమల్, అవునూరి శ్రీనివాస్, నరసింహ, శంకర్ రావు, మహేష్, శ్రవణ్ గౌడ్, కృష్ణప్రసాద్, నరసింహ, రాంచంద్రం, నరేందర్, రవి, సత్యనారాయణ, రైక శ్రీనివాస్, ఎల్లయ్య, శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, సత్యనారాయణ, కాలనీ వాసులు పాల్గోన్నారు.



# అనుబంధాలకు రక్ష... ఆత్మీయతను పెంచే గొప్ప పండుగ రాఖీ

## మానవ సంబంధాలను ఏకం చేసే గొప్ప పండుగ

## మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్

సిద్దిపేట,ఆగస్టు 09 సమయజ్యోతి

:సోదర సోదరీమణుల మధ్య ఆత్మీయతా అనుబంధం పెంచేది ఈ రాఖీ పండుగ అని మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అన్నారు. సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలో శనివారం మాజీ ఎమ్మెల్సీ సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు ఆడపడుచులు ఫరూక్ హుస్సేన్ కు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోదరుడు, సోదరి మధ్యలో ఉన్న ప్రేమ, బాధ్యత అనుబంధాన్ని సూచించే గొప్ప పండుగే రాఖీ అని అన్నారు. తెలంగాణలో కుల మతాలకు అతీతంగా సోదర భావంతో జరుపుకునే పండుగల్లో ఇదొక గొప్ప పండుగ అని అన్నారు. ఈ పండుగ ద్వారా మానవ సంబంధాల గొప్పతనం గుర్తు వస్తుందన్నారు. బంధాలను అతికించే ఈ పండుగను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని, దేవుడి దయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు సత్తవ్వ, సంతోష, వెంకటవ్వ, మానస, శ్యామల, అక్షయా, లచ్చవ్వ, వినోదా, నరసవ్వ, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

# ఏఐసీసీ ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర

## పాదయాత్రకు పెద్దఎత్తున స్పందన - బిసి రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం - మీడియా చిట్‌చాట్‌లో మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్,ఆగస్ట్9సమయజ్యోతి:

ఏఐసీసీ ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర చేస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ పాదయాత్రకు పెద్దఎత్తున స్పందన వచ్చిందన్నారు. ప్రజలు కూడా నేరుగా వచ్చి కలుస్తున్నారని అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ప్రతినెల కొన్ని నియోజకవర్గాల్లో జనహిత పాదయాత్ర చేస్తానన్నారు. ఈ నెల చివరి వారంలో దీనికి రెండో దశ ఉంటుందని పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల దిల్లీ ధర్నాకు ఖర్గే, రాహుల్ గాంధీ రాలేకపోయారని తెలిపారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యల పై ఏఐసీసీ పరిశీలన చేస్తోంది. కొండా మురళి వ్యవహారం త్వరలో ముగిసిపోతుంది. అనిరుద్‌రెడ్డికి షోకాజ్ నోటీసు ఇచ్చారు.. వివరణ కూడా తీసుకు న్నాం. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. బీసీల కోరిక న్యాయబద్ధమైనది. ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేస్తున్నాయి. భాజపా మిత్రపక్షాలపై 3.5 శాతం మాత్రమే ఈడీ కేసులున్నాయి. మిగిలిన 96.5 శాతం విపక్షాలపైనే ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘాన్ని భాజపా జేబులో పెట్టుకొని తిరుగుతోంది. అవినీతి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం పద్ధతి ప్రకారం ముందుకు పోతుంది. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్‌పై సమగ్రంగా చర్చించి ముందకు వెళ్తాం. బండి సంజయ్ ఆరోపణలు అర్థరహితంగా ఉన్నాయని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. రిజర్వేషన్లపై బీజేపీ నేతలు వితండవాదం చేస్తున్నారని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీఆర్ఎస్ శిఖండి పాత్ర పోషిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో ధర్నాలో బీఆర్ఎస్ ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు.ధర్నాలో పాల్గొన కపోగా అవహేళన చేసి మాట్లాడు తున్నారని మండిపడ్డారు. బీజేపీ, బీఆర్ఎస్ కు తెలంగాణ ప్రజలు గుణపాఠం చెబు తారని వ్యాఖ్యానించారు. బీసీ జనాభా లెక్కలు తెలుసుకునేందుకే కులగణన చేసినట్లు- తెలిపారు. ఆ తరువాతే.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిం చాలని నిర్ణయించామన్నారు. రాహుల్ గాంధీ హామీ మేరకు బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడుతున్నామని స్పష్టం చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో..42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని రెండు బిల్లులు తీసుకొచ్చామని పేర్కొ న్నారు. రిజర్వేషన్లు 50 శాతం మించ కూడదని చట్టం చేసిందని, చేసిన చట్టాన్ని అధిగమించేందుకే ఆర్డినెన్స్ తీసుకొచ్చినట్లు- చెప్పారు. 4 నెలలు గడుస్తున్నా బిల్లులను రాష్ట్రపతి ఆమోదించలేదని అసహనం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం క్షేత్రస్థాయిలో అన్ని ప్రయత్నాలు చేసినట్లు- తెలిపారు. శాసన సభలో ఏకగ్రీవ ఆమోదంతోనే చట్టాలను ఢిల్లీకి పంపామని పేర్కొన్నారు. కులగణన మోడల్‌ను రాహుల్, ఖర్గే ప్రశంసించారని హర్షం వ్యక్తం చేశారు. ధర్నాకు రాహుల్, ఖర్గే రాకపోవడంపై గల్లీ లీడర్లలా కిషన్‌రెడ్డి మాట్లాడటం సరికాదన్నారు.



# ఘనంగా రక్షా బంధన్ వేడుకలు

కరీంనగర్ ఆగస్టు 09 సమయజ్యోతి:



సోదరి సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయతలకు చిహ్నంగా నిలిచే రాఖీ పండుగను జమ్మికుంట మండల ప్రజలు శనివారం ఆనందోత్సాహాల మధ్య వైభవంగా జరుపుకున్నారు. ప్రతీ ఇంట్లో సోదరిమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి అప్యాయతను చాటారు. యువతులు, మహిళల సందడితో ఇళ్లలో పండుగ వాతావరణం నెలకొంది. బస్టాండ్, షాపింగ్ ప్రాంతాలు మహిళలతో రద్దీగా మారాయి.

# మంత్రాలయ ఉత్సవాలకు టిటిడి పట్టు వస్త్రాలు

**మంత్రాలయం,ఆగస్టు9సమయజ్యోతి:**

తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన పట్టు- వస్త్రాలు ఊరేగింపుతో రాఘవేంద్రస్వామి మఠం చేరుకున్నాయి. శనివారం రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల సందర్భంగా టిటిడి ఎఇఓ రామకృష్ణ తిరుమల తిరుపతి దేవస్థానాల నుండి శ్రీవారి వస్త్రాన్ని తీసుకువచ్చారు. శ్రీ మఠం అధికారులు,పండితుల వేద మంత్రాల మధ్య మంగళ వాయిద్యాల నడుమ ప్రధాన ఆర్చి మహాద్వారం వద్ద నుంచి సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. మధ్వ కారిడార్ గుండా శ్రీ మఠానికి చేరుకున్న వారు గ్రామ దేవత శ్రీ మంచలమ్మకు చీరను అందజేసి విశేష పూజలతో సమర్పణతో మంగళ హారతులు స్వీకరించారు. అనంతరం శ్రీవారి వస్త్రాన్ని స్వామిజీకి అప్పగించారు. శ్రీ స్వామిజీ భక్తితో శ్రీ స్వామి వారి మూల బందావనం వద్ద వస్త్రాన్ని సమర్పించారు. అనంతరం టీటీడీ అధికారులు శ్రీవారీ శేషవస్త్రం, ప్రసాదాలను స్వామిజీకి సమర్పించారు. ఈ సందర్భంగా స్వామిజీ శ్రీరామకృష్ణ ను అతని కుటుంబ సభ్యులకు ఆశీర్వదించారు, వారిని శేషవస్త్రం, మెమెంటో మరియు ఫల మంత్రాక్షతలు అందజేసి సత్కరించారు.



## బహూశా రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంటా : మల్లారెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు9సమయజ్యోతి:**



బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మల్లారెడ్డి తన రాజకీయ జీవితంపై సంచలన కామెంట్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మల్లారెడ్డి మాట్లాడారు. తాను రాజకీయంగా బీజేపీ వైపా, తెలుగుదేశం వైపా, బీఆర్ఎస్ పార్టీల వైపా అన్నది కాదని... తాను ఇప్పటికీ కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని క్లారిటీ ఇచ్చారు మల్లారెడ్డి. తాను ఇప్పుడు ఏ వైపునకు చూసేటట్లుగా కూడా లేనని స్పష్టం చేశారు. తనకు 73సంవత్సరాలు వచ్చాయని.. ఇంకా ఏవైపునకు చూడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. తాను ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిని అయ్యానని ఇంకా మూడేళ్లు రాజకీయాల్లో ఉంటానని చెప్పుకొచ్చారు. అస్సలు తాను రాజకీయమే వద్దనుకుంటున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేసి మంచి కాలేజీలు, యూనివర్సిటీలు నడిపిద్దామని అనుకుంటున్నానని మల్లారెడ్డి పేర్కొన్నారు.

## హైకోర్టు ఆదేశాలకను గుణంగా స్థానిక ఎన్నికలు

### కావాలనే రిజర్వేషన్లపై బీజేపీ రాద్ధాంతం : పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్,ఆగస్టు9సమయజ్యోతి:**



బీసీల రిజర్వేషన్లపై బీజేపీ పార్టీ కావాలనే రాద్ధాంతం చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే స్థానిక ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని తమ ప్రభుత్వం ఎక్కడా పేర్కొనలేదని స్పష్టంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు బీజేపీ నేతలు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు కావాలనే బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో వారి సోదరులకు మంత్రి సీతక్క రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీతక్కకు మంత్రి పొన్నం చీరను బహూకరించారు. సీతక్క నుంచి పొన్నం ప్రభాకర్ ఆశీర్వాదం తీసుకున్నారు. సీతక్కకు పొన్నం ప్రభాకర్ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాఖీ పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ రాఖీ కట్టారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సోదరి సీతక్క అంటూ ఆత్మీయంగా పలకరించి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుకి మంథని నియోజకవర్గ మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## ఐసీఐసీఐ బ్యాంకు కనీస బ్యాలెన్స్ రూ. 50 వేలు

**న్యూఢిల్లీ, ఆగస్టు9సమయజ్యోతి**

: ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతి నెలా కనీస బ్యాలెన్స్‌ను పెంచేసింది. కొత్త కస్టమర్లకు ఈ రూల్ వర్తించనున్నది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఇది అమలులోకి వస్తోంది. మెట్రో, అర్బన్ లొకేషన్లలో ఉన్న కస్టమర్లు.. తమ సేవింగ్స్ ఖాతాల్లో కనీస బ్యాలెన్స్‌ను 50 వేలు మెయింటేన్ చేయాల్సి ఉంటుంది. పెనాల్టీలు తప్పించుకోవాలంటే కనీస బ్యాలెన్స్ తప్పనిసరి అవుతుంది. బ్యాంక్ తన వెబ్‌సైట్‌లో ఈ తాజా సమాచారాన్ని పోస్టు చేసింది. అయితే పాత కస్టమర్లకు మాత్రం కనీస బ్యాలెన్స్ 10వేలు మాత్రమే ఉంచింది. సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉన్న కొత్త కస్టమర్లకు.. కనీస బ్యాలెన్స్ 25వేలుగా ఫిక్స్ చేశారు. గ్రామీణ ప్రాంత కస్టమర్లకు దీన్ని 10వేలుగా నిర్ధారించారు. అయితే రూరల్ , సెమీ అర్బన్ ప్రాంతాల్లో ఉన్న పాత కస్టమర్లకు కనీస బ్యాలెన్స్ 5వేలుగా ఉంది. కనీస బ్యాలెన్స్ మెయింటేన్ చేయని వారు ఆరు శాతం ఫైన్ కట్టాల్సి ఉంటుంది. సేవింగ్స్ ఖాతాలో మూడు సార్లు ఉచితంగా క్యాష్ డిపాజిట్ కోసం అవకాశం కల్పించారు. ఆ తర్వాత ప్రతి ట్రాన్‌జాక్షన్‌కు 150 చెల్లించాల్సి ఉంటుంది. కాంప్లిమెంటరీ క్యాష్ విత్‌డ్రాలను నెలకు మూడుసార్లు మాత్రమే చేశారు. సేవింగ్స్ అకౌంట్‌లో థార్డ్ పార్టీ క్యాష్ డిపాజిట్ ప్రతి ట్రాన్‌జాక్షన్‌కు 25వేలుగా ఫిక్స్ చేశారు.

# 334 రాజకీయ పార్టీల గుర్తింపు రద్దు

## బీహార్ ఓట్ల రివిజన్‌ను సమర్థించుకున్న ఇసి

**న్యూఢిల్లీ,ఆగస్ట్9సమయజ్యోతి:**

దేశంలో రాజకీయ పార్టీల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం సవరించింది. గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించింది. నిబంధనల ప్రకారం.. ఈసీ వద్ద నమోదైన రాజకీయ పార్టీలు ఆరేళ్లలో కనీసం ఒక్క ఎన్నికలోనైనా పోటీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ పార్టీలు 2019 నుంచి ఒక్క ఎన్నికలోనూ బరిలోకి దిగకపోవడంతో వాటిపై ఈసీ వేటు- వేసింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతా లకు చెందిన 334 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు- ఎన్నికల సంఘం తెలిపింది. పేరుకు పార్టీలు పెట్టినప్పటికీ.. వీటికి భౌతికంగా ఎలాంటి కార్యాలయాలు అందుబాటులో లేవని వెల్లడించింది. ఇప్పటివరకు దేశంలో 2,854 గుర్తింపుపొందని పార్టీలు ఈసీ వద్ద రిజిస్టర్ అయి ఉన్నాయి. తాజా చర్యతో ఆ సంఖ్య 2,520కి తగ్గింది. ఎన్నికల సంఘం వద్ద ఉన్న డేటా ప్రకారం.. ప్రస్తుతం దేశంలో ఆరు జాతీయ పార్టీలుగా కొనసాగుతున్నాయి. 67 ప్రాంతీయ రాజకీయ పార్టీలు మనుగడలో ఉన్నాయి. ఇదిలావుంటే బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు అధికారి పార్టీకి మద్దతుగా ఎన్నికల సంఘం వ్యవహరిస్తోందని.. 65 లక్షల ఓట్లను తొలగించిందంటూ విపక్ష పార్టీలు ఆరోపించాయి. పార్లమెంట్ వేదికగా ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలు చేపట్టాయి. అంతేకాకుండా ఇటీవల ఢిల్లీ వేదికగా రాహుల్‌గాంధీ ప్రత్యేక విందు ఏర్పాటు చేసి ఓట్ల కుట్రపై ప్రజెంటేషన్స్ ఇచ్చారు. తాజాగా ఇదే అంశంపై ఎన్నికల సంఘం స్పందించింది. బీహార్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై రాజకీయ పార్టీలు ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదులు గానీ అభ్యంతరాలు సమర్పించలేదని వెల్లడించింది. ఓటర్ల జాబితా ప్రకటించిన దగ్గర ఇప్పటి వరకు ఎవరూ స్పందించలేదని పేర్కొంది. జూలై 21న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభ మయ్యాయి. బీహార్‌లో జరుగుతున్న ఓట్ల ప్రత్యేక సర్వేపైనే సభలో ఆందోళనలు జరుగుతున్నాయి. ప్రస్తుతం వాయిదాల పర్వం కొనసాగుతోంది. అయితే ఈ ఆరోపణలను ఈసీ ఖండించింది. అనర్హులైన ఓటర్ల పేర్లనే తొలగిస్తున్నట్లు- తెలిపింది.

# సోదరీ సోదరిమణులకు మోదీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, ఆగస్టు9సమయజ్యోతి:**

రాఖీ పండుగ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఈ పండుగ సోదరీ–సోదరుల మధ్య ప్రేమను మరింత పెంచుతుందని గుర్తు చేశారు. అలాగే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ఈ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సోదరీ–సోదరుల మధ్య ప్రేమ, నమ్మకం, రక్షణ వంటి అవినాభావ బంధాన్ని సూచిస్తుందని ఆయన అన్నారు. ఈ పండుగ మీ జీవితంలో ఆనందం, ఉత్సాహం నింపాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ఈ పండుగ సోదరీమణుల రక్షణ స్ఫూర్తిని మరింత బలపరుస్తుందని ఆయన ఆశించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారు కూడా ఈ సందర్భంగా తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రక్షాబంధన్ శుభ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు. ఈ పండుగ రాఖీ దారం పవిత్రతకు చిహ్నం మాత్రమే కాదు, సోదరీమణుల గౌరవం, భద్రత, ఆనందం, శ్రేయస్సుకు నిబద్ధత కూడా అని గుర్తు చేశారు. ఈ పండుగ మనలో రక్షణ స్ఫూర్తిని బలపరచాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఇదే రోజున, మన దేశ చరిత్రలో మరో ముఖ్యమైన సంఘటన కూడా జరిగింది. అదే క్విట్ ఇండియా ఉద్యమం జరిగిన రోజు. నేడు 83వ వార్షికోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి మోదీ గారు ఆ ఉద్యమంలో పాల్గొన్న ధైర్యవంతులకు నివాళులు అర్పించారు. బాపు గారి స్ఫూర్తిదాయక నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ధీరులందరినీ మనం కృతజ్ఞతతో గుర్తుంచుకుంటామని గుర్తు చేశారు. ఆ ఉద్యమం అనేక మంది ప్రజలను స్వేచ్ఛ కోసం ఏకం చేసిందని, మన స్వాతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించినట్లు వెల్లడించారు. ఆ ధీరుల త్యాగం వల్లే మనం ఈ రోజు స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటున్నామని అభిప్రాయం వ్యక్తం చేశారు.



# మిలటరీ, సాంకేతిక అంశాలపై రష్యాతో భేటీ

**న్యూఢిల్లీ, ఆగస్టు9సమయజ్యోతి:**

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పర్యటన కొనసాగుతోంది. ఈ పర్యటనలో భాగంగా మొన్న రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమైన దోవల్.. తాజాగా ఆ దేశ ఉప ప్రధాని డెనిస్ మంతురోవ్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భ ంగా మిలిటరీ–సాంకేతిక ఒప్పందాలపై ద్వైపాక్షిక చర్చలు జరిపినట్లు రష్యా రాయబార కార్యాలయం ప్రకటించింది. పౌర విమానాల తయారీ, రసాయన పరిశ్రమ సహా ఇతర వ్యూహాత్మక రంగాల్లో ఉమ్మడి ప్రాజెక్టుల పురోగతిని ఇరుపక్షాలు సమీక్షించినట్లు పేర్కొంది. కాగా, ఈనెల 7న పుతిన్‌తో దోవల్ భేటీ అయిన విషయం తెలిసిందే. క్రెమ్లిన్ వేదికగా నిర్వహించిన ఈ సమావేశంలో రష్యా భద్రతామండలి సెక్రటరీ సెర్గీ షోయిగు, క్రెమ్లిన్ సహాయకుడు యూరి ఉషకోవ్ పాల్గొన్నారు. రష్యా చమురు కొనుగోళ్లతో భారత్‌పై అమెరికా అధిక సుంకాలు వధించిన వేళ దోవల్ మాస్కో పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు రష్యా అధినేత పుతిన్‌తో ప్రధాని ఫోన్‌లో మాట్లాడిన విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో స్వదేశంలో భారత్, రష్యా 23వ వార్షిక సమావేశం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పిన మోడీ.. ఉక్రెయిన్ యుద్ధం పురోగతి విషయమై రష్యా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. 'స్నేహితుడు పుతిన్‌తో సంభాషణ సమగ్రంగా, ఉపయుక్తంగా సాగింది. ఉక్రెయిన్ యుద్ధం తాజా అప్‌డేట్స్ విషయంలో ఆయనకు ఫోన్‌లోనే ధన్యవాదాలు తెలియజేశాను. భారత్, రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై కూడా ఇద్దరం చర్చించాం. అంతేకాదు రష్యాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకునే విషయంలో కట్టుబడి ఉన్నామని పుతిన్‌తో చెప్పాను. ఈ ఏడాది చివర్లో పుతిన్‌ను భారత్‌కు ఆహ్వానించనున్నాను' అని మోడీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై మరోసారి భారత్ తటస్థ వైఖరిని మోడీ స్పష్టం చేశారు. ఇరు దేశాధినేతలు చర్చిం చుకొని.. శాంతియుతంగా సమస్యను పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.



# ఢిల్లీలో కుండపోత వర్షాలు

## గోడకూలిన ఘటనలో ఏడురుగు మృతి

**న్యూఢిల్లీ,ఆగస్ట్9సమయజ్యోతి:**

దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షం కారణంగా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. జైత్‌పూర్‌లో శనివారం ఉదయం గోడ కూలిపోవడంతో ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కొంతమంది శిథిలాల కింద చిక్కుకున్నారు. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించారు. రంగంలోకి దిగిన పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలో భారీ వర్షాలకు గోడకూలి ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. హస్తినలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్టు- తెలుస్తోంది. ఢిల్లీలోని హరినగర్‌లో ఈ ఘటన చోటు-చేసుకుంది. ఈ ప్రమాదంలో 8 మందిని రక్షించారు, తీవ్రంగా గాయపడ్డ నలుగురుని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీగా కురిసిన వర్షం కారణంగా హరి నగర్‌లోని జైత్‌పూర్ ప్రాంతంలో గోడ కూలిపోవడంతో, పాత ఆలయం పక్కనే ఉన్న జగ్గీలలో నివసిస్తున్న వాళ్లు ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. భవిష్యత్తులో అలాంటి ఘటనలు జరగకుండా జగ్గీలను ఖాళీ చేయించామని సౌత్ ఈస్ట్ అదనపు డీసీపీ ఐశ్వర్య శర్మ తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఢిల్లీ అగ్నిమాపక బృందాలు తక్షణమే రంగంలోకి దిగి సహాయక చర్యను ప్రారంభించాయి. మృతులను షబీబుల్ (30), రబీబుల్ (30), అలీ (45), రుబినా (25), డాలీ (25), రుక్సానా (6) హాసీనా (7) గా గుర్తించారు. ఢిల్లీలోని సివిల్ లైన్స్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కూలిపోయి ఇద్దరు మృతి చెందిన ఘటన జరిగిన పది రోజుల తర్వాత ఈ ప్రమాదం చోటు-చేసుకుంది. ఢిల్లీ ఇవాళ భారీ వర్షాలతో అతలాకుతలమైంది. వర్షాల కారణంగా దేశ రాజధానిలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాల కారణంగా వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. భారీ వర్షాల కారణంగా విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం, శనివారం ఉదయం 8.30 గంటల వరకు సఫ్దర్‌జంగ్‌లోని ఢిల్లీ ప్రాథమిక వాతావరణ కేంద్రంలో 78.7 మి.మీ., ప్రగతి మైదాన్‌లో 100 మి.మీ., లోధి రోడ్‌లో 80 మి.మీ., పూసాలో 69 మి.మీ., పాలంలో 31.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. అటు–, యమునా నది నీటి మట్టం కూడా ప్రమాదకర స్థాయి 204.50 మీటర్లకు చేరుకుంది. ఓల్డ్ రైల్వే వంతెన దగ్గర ఉదయం 9 గంటలకు నీటి మట్టం 204.40 మీటర్లు ఉంది.



# రాహుల్‌గాంధీకి శరద్‌పవార్ మద్దతు

ఢిల్లీ, ఆగస్టు 9సమయజ్యోతి



: మహారాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శరద్ పవార్ తాజాగా రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచారు. రాహుల్ గాంధీ ఇటీవల ఓ ప్రెజెంటేషన్ ద్వారా ఓట్ల దొంగతనం, ఫేక్ ఓటర్ల లిస్ట్ గురించి ప్రస్తావించారు. దీనిపై శరద్ పవార్ తనదైన శైలిలో స్పందించారు. ఈ విషయాన్ని భారత ఎన్నికల కమిషన్ సమగ్రంగా పరిశీలించాలని, ఇది చిన్న విషయం కాదన్నారు. వాటిలో కర్ణాటక, మహారాష్ట్రలలో ఎన్నికలు లేకపోయినా, దేశవ్యాప్తంగా పద్ధతిగా జరిగే ఎన్నికల మీద ఇలాంటి అంశాలు ప్రభావం చూపుతాయని ఆయన హెచ్చరించారు. రాహుల్ గాంధీ ఈ విషయాలను ప్రస్తావించే ముందు స్పష్టమైన అధ్యయనం చేశారని పవార్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇండియాపై తిరిగి 25% నుంచి 50% వరకు దిగుమతి సుంకాలు పెంచే ప్రతిపాదన చేయడం పట్ల శరద్ పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారత్‌పై ఒత్తిడి తేవాలనే ప్రయత్నం అని ఆయన పేర్కొన్నారు. విదేశాంగ విధానాల్లో మన దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ఆయన స్వరం పెంచారు. పాకిస్తాన్ శత్రువులా మారింది, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకతో సంబంధాలు అంత మంచిగా లేవన్నారు. మనం ఈ సంబంధాలను మెరుగుపరచుకోవాలన్నారు. ప్రధాని మోదీ ఈ విషయాలను పట్టించుకోవాలని పవార్ హితవు పలికారు. అజిత్ పవార్‌తో శరద్ పవార్ కలిసి కనిపించడం, ప్రత్యేకించి కుటుంబ వేడుకల్లో కలసి కనిపించడం రాజకీయంగా కొత్త చర్చకు తావిచ్చింది. ఇటీవల ముంబైలో జరిగిన యుగేంద్ర పవార్ నిశ్చితార్థ వేడుకలో శరద్ పవార్, అజిత్ పవార్ ఇద్దరూ కలిసి పాల్గొన్నారు. దీంతో శివసేన బీజేపీ కూటమికి శరద్ పవార్ మద్దతు ఇవ్వబోతున్నారా? అనే చర్చ మొదలైంది. కానీ శరద్ పవార్ తన పాత ధోరణి గురించి స్పష్టం చేశారు. బీజేపీకి ఎప్పటికీ మద్దతు ఇవ్వనని, రాజకీయాల్లో తన సిద్ధాంతాలకే కట్టుబడి ఉంటానని మరోసారి గుర్తు చేశారు.

# ఆపరేషన్ సిందూర్‌లో ఐదు జెట్లను కూల్చేశాం

## ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్

ఢిల్లీ, ఆగస్టు 9సమయజ్యోతి:



ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్లను కూల్చేశామని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సాయంతో ఐదు పాకిస్తాన్ జెట్లను పేల్చిపడేశాము. ఐదు జెట్లను మాత్రమే కాకుండా.. ఓ భారీ 'ఎయిర్‌బర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్ క్రాఫ్ట్'ను కూడా కూల్చేశాము. రెండు వైమానిక స్థావరాలు ధ్వంసం చేశాం. మే 9, 10 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. మే 9వ తేదీ రాత్రి ఎక్కువగా పాక్ ఉగ్ర శిబిరాలపై దాడులు చేశాం. డ్రోన్, ఎస్ 400 గగనతల రక్షణ వ్యవస్థ బాగా పనిచేసింది. వారి యుద్ధ విమానాలు భారత గగనతలంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నాం. వాటిని ఎంతో సమర్థవంతంగా కూల్చిపడేశాం. ఆపరేషన్ సింధూర్‌తో పాక్‌కు స్పష్టమైన సందేశమిచ్చాం' అని ఆయన అన్నారు. కాగా, ఏప్రిల్ 22వ తేదీన జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. అమాయక పర్యాటకులను కాల్చి చంపారు. 26 మందిని బలి తీసుకున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేసింది. దీంతో 100 మంది ఉగ్రవాదులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉగ్రవాదులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకోవటంతో పాక్ తట్టుకోలేకపోయింది. యుద్ధానికి దిగింది. యుద్ధంలో భారీ ఎత్తున నష్టపోయింది. చివరకు తోకముడిచింది.

# భారత్‌పై ద్వేషంతో ఆ దేశం 400 కోట్లు నష్టపోయింది

ఢిల్లీ, ఆగస్టు 9సమయజ్యోతి:



పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ ఎన్నో నిర్ణయాలు తీసుకుని వాటిని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో పాకిస్థాన్ కూడా భారత్‌కు వ్యతిరేకంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంది. భారత్ విమానాలకు గగనతలాన్ని మూసేయడం ఆ వ్యతిరేక నిర్ణయాల్లో ఒకటి. అయితే పాకిస్థాన్ తీసుకున్న ఆ నిర్ణయం ఆ దేశానికి తీవ్ర నష్టం కలుగజేసింది. ఈ నిర్ణయం కారణంగా పాకిస్థాన్ రెండు నెలల్లోనే దాదాపు రూ.400 కోట్లు కోల్పోయింది. భారత్ నుంచి వచ్చే విమానాలను ఏప్రిల్ 24వ తేదీ నుంచి పాకిస్థాన్ తన గగనతలంలోకి అనుమతించడం లేదు. ఈ నిషేధం ఇప్పటికీ కొనసాగుతోంది. నిజానికి భారత్ నుంచి వెళ్లే అంతర్జాతీయ విమానాలు చాలా వరకు పాకిస్థాన్ గగనతలాన్ని వాడుకుంటాయి. పాక్ గగనతలం మీదుగా రోజుకు 100 నుంచి 150 భారతీయ విమానాలు ప్రయాణిస్తుంటాయి. ఇలా గగనతలాన్ని వాడుకున్నందుకు ఓవర్ ఫ్లైయింగ్ ఛార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క బోయింగ్ విమానం పాక్ గగనతలం మీదుగా ప్రయాణిస్తే దాదాపు 580 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. పాకిస్థాన్ గగనతలం మూసేయడంతో భారత్ విమానాలు వేరే మార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. దీంతో ఆ ఓవర్ ఫ్లైయింగ్ ఛార్జీలను పాకిస్థాన్ కోల్పోయింది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 20 మధ్యలో పాకిస్థాన్ ఎయిర్ పోర్ట్స్ అథారిటీకి రూ.410 కోట్ల నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని పాక్ రక్షణ మంత్రిత్వ శాఖ అక్కడి అసెంబ్లీలో వెల్లడించినట్లు డాన్ నివేదించింది. ఈ ఆంక్షల వల్ల పాకిస్థాన్ ఏడాదికి వేల కోట్ల రూపాయలను కోల్పోతుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

# శ్రీవారి ఆలయంలో వైభవంగా ఉపాకర్మ సేవ

తిరుమల,ఆగస్ట్9సమయజ్యోతి:





తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి నిత్యం ఏదోఒకటి కైంకర్యం జరుగుతుంది. శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా శ్రీవారి ఆలయంలో స్వామి వారికి ఉపాకర్మ సేవ వైభవంగా జరిగింది. ఉదయం 6 గంటలకు స్వామివారికి శ్రీ భూవరహస్వామివారి ఆలయంలో సంప్రదాయంగా యజ్ఞోపవీతాన్ని మార్చారు. శ్రీకృష్ణస్వామివారిని.. శ్రీ భూవర హస్వామివారి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అర్చక స్వాముల వారు కలియుగ దేవుడు..తిరుమల శ్రీవెంటేశ్వరస్వామికి పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం యజ్ఞోపవీతాన్ని సమర్పించి .. హారతి ఇచ్చి.. ఆస్థానం నిర్వహించి మరల ఊరేగింపుగా గోవింద నామ స్మరణతో శ్రీ కృష్ణ స్వామి వారిని తిరిగి ఆలయానికి చేరుకుంటూ .. భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పారుపత్తేదార్ హిమంతగిరి, అర్చకులు, ఇతర ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తమ్ముడు బాలకృష్ణకు పురందేశ్వరి రాఖీ

## అక్క ఆశీర్వాదం తీసుకున్న బాలయ్య

హైదరాబాద్,ఆగస్ట్9సమయజ్యోతి:



రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని నందమూరి బాలకృష్ణకు తన సోదరి దగ్గుబాటి పురందేశ్వరి రాఖీ కట్టింది. ఆ తర్వాత ఇరువురు ఒకరికొకరు స్వీట్స్ తినిపించుకున్నారు. ఆ తర్వాత బాలకృష్ణ తన సోదరి పురందేశ్వరి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను దగ్గుబాటి పురందేశ్వరి సోషల్ మీడియా వేదకగా పంచుకున్నారు. దీంతో ఈ వీడియో వైరల్ అవుతోంది. దగ్గుబాటి పురందేశ్వరి వీడియోని షేర్ చేస్తూ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేస్తూ.. తన సందేశాన్ని తెలిపింది. ఈ సందేశంలో..ఈ రోజు రక్షాబంధన్, నా హృదయానికి అత్యంత దగ్గరగా ఉన్న ప్రత్యేక రోజు. నా తమ్ముడి చేతికి రాఖీ కట్టి.. అతని ఆరోగ్యం, ఆనందం, ప్రతి కల నిజం కావాలని హృదయపూర్వకంగా ప్రార్థించాను. ఈ పవిత్ర క్షణం నా మనసును సంతోషం, ప్రేమతో నింపిందని పేర్కొన్నారు. అలాగే ప్రియమైన సోదరులారా, మీరు నా జీవితంలో ప్రతి సమయంలో నా కవచంలా, నా నమ్మకమైన తోడుగా ఇంకా నా ప్రాణ స్నేహితులుగా ఉన్నారని అన్నారు. మీ అందరికీ మంచి ఆరోగ్యం, మీ కలలను నెరవేర్చడానికి శక్తి, మీరు వేసే ప్రతి అడుగులో విజయం లభించాలని కోరుకుంటు-న్నానని రాసుకొచ్చారు. మనం పంచుకున్న ప్రతి జ్ఞాపకం నాకు అమూల్యం. నవ్వు, ప్రేమ, ఆనందంతో నిండిన భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్నానని అన్నారు. అలాగే ఈ రోజు రక్షాబంధన్‌ను జరుపుకుంటు-న్న ప్రతి సోదర సోదరీలకు, గడిచే ప్రతి రోజుతో మీ బంధం మరింత బలపడాలని ఆశిస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి సోదర సోదరీమణులకు నా హృదయపూర్వక ప్రార్థనలు, ప్రేమ.. రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# 334 రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగింపు

## నిర్ణయం తీసుకున్న ఈసీ

న్యూఢిల్లీ, ఆగస్టు9సమయజ్యోతి:




దేశవ్యాప్తంగా 334 రాజకీయ పార్టీలను రిజిస్టర్ జాబితా నుంచి ఎన్నికల సంఘం (ఈసీ) తొలగించింది. 2019 నుంచి ఏ ఒక్క ఎన్నికల్లో పోటీ చేయని ఈ రాజకీయ పార్టీలపై ఈ నిర్ణయం తీసుకున్నది. ఈసీ వద్ద రిజిస్టర్ అయినప్పటికీ గుర్తింపులేని 334 రాజకీయ పార్టీలు 2019 నుంచి ఆరేళ్లలో ఏ ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయలేదని ఈసీ తెలిపింది. ముఖ్యమైన ఈ షరతును నెరవేర్చడంలో విఫలమైనందుకు రిజిస్టర్ అయిన 334 గుర్తింపు లేని రాజకీయ పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు శనివారం పేర్కొంది. కాగా, గుర్తింపు లేని ఈ 334 రాజకీయ పార్టీలు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందినవని ఈసీ తెలిపింది. అయితే జాబితా నుంచి తొలగించిన ఈ పార్టీల కార్యాలయాలు భౌతికంగా కూడా ఎక్కడా లేవని పేర్కొంది. మొత్తం 2,854 నమోదిత గుర్తింపు లేని రాజకీయ పార్టీల్లో 334 పార్టీల తొలగింపు తర్వాత 2,520 రాజకీయ పార్టీలు రిజిస్టర్ జాబితాలో ఉన్నట్లు ఈసీ వివరించింది. ప్రస్తుతం ఆరు జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు ఉన్నాయని వెల్లడించింది.

# చెట్టుకు రాఖీ కట్టిన కేంద్ర మంత్రి

భోపాల్, ఆగస్టు9సమయజ్యోతి:

దేశవ్యాప్తంగా శనివారం రాఖీ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఓ చెట్టుకు రాఖీ కట్టారు మంత్రి శివరాజ్. వృక్షాలు ఆక్సిజన్ అందిస్తాయని, పక్షులు..ఇతర జీవాలు కూడా చెట్లను జీవాధారంగా భావిస్తాయని ఆయన అన్నారు. చెట్టుకు రెండు రాఖీలు కట్టిన ఆయన.. హారతి కూడా ఇచ్చారు. ఆ తర్వాత కొందరు మహిళలు, అమ్మాయిలు.. మంత్రి శివరాజ్‌కు రాఖీ కట్టారు. ఆ ఆడపడుచులను ఆయన ఆశీర్వదించారు.

# కోర్ట్ ఆఫ్ ఆస్తుల కింద ప్రభుత్వానికి లక్షల కోట్లు

## మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

హైదరాబాద్,ఆగస్టు9సమయజ్యోతి:



కోర్ట్ ఆఫ్ వార్డ్స్ ఆస్తుల కింద రాష్ట్ర ప్రభుత్వానికి లక్షల కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉందని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు తెలిపారు. గత ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి, రోశయ్య ఇతరులకు చెప్పానని.. వారు పట్టించు కోలేదని చెప్పుకొచ్చారు. ఢిల్లీ వేదికగా శనివారం మీడియాతో గోనె ప్రకాష్ రావు మాట్లాడారు. ప్రస్తుత రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కూడా చెప్పానని.. దీనిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరానని.. వారిని కలిసి ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఏఐసీసీ పెద్దలకు కలిసి తన వద్ద ఉన్న వివరాలు అందిస్తానని స్పష్టం చేశారు గోనె ప్రకాష్ రావు.తెలంగాణలో 6 రాజ కుటుంబాల ఆస్తులు, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ఆస్తులు ప్రైవేట్ వారి చేతుల్లో ఉన్నాయని గుర్తుచేశారు. బ్రిటిష్ చట్టం కాబట్టి దీనిపై ఎవరు ఏమి చేయలేకపోతున్నారని అన్నారు. ల్యాండ్ క్రూజర్ కార్లు, ఇన్నోవా కార్లపై మాత్రమే ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టి ఉందని వెల్లడించారు. రేపు ప్రతి మంత్రి హెలికాప్టర్‌లో తిరగాలని ప్లాన్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాలని తాను చూస్తున్నానని తెలిపారు గోనె ప్రకాష్ రావు. రెండు రోజుల్లో కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని కలుస్తానని.. ఆ ఆస్తులను కాపాడాలని కోరుతానని గోనె ప్రకాష్ రావు చెప్పారు. గతంలో ఈ విషయంపై జానారెడ్డి అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో పూర్తయిన తర్వాత కేంద్రంలో కూడా కోర్ట్ ఆఫ్ వార్డ్స్ ఆస్తుల అంశాన్ని బీజేపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పుకొచ్చారు. ఆదాయాన్ని సమకూర్చుకుంటే రెండు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజా హితం కోసం తన వంతుగా ఈ విసయంపై ప్రయత్నం చేస్తున్నానని గోనె ప్రకాష్ రావు పేర్కొన్నారు.

# గోవాలో తెలుగు జంటపై దాడి

హైదరాబాద్,ఆగస్టు9సమయజ్యోతి:

గోవాలో మరో దారుణం చోటుచేసుకుంది.. గోవా విహార యాత్రలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఓ జంటపై పనాజీ బస్‌స్టాండ్ వద్ద దాడి జరిగింది. బైక్ అద్దె విషయంలో జరిగిన చిన్నపాటి వివాదం ఘర్షణకు దారి తీసింది. వరుసగా సెలవులు రావడంతో.. హైదరాబాద్‌కు చెందిన ఈ జంట గోవాలో గడిపేందుకు వెళ్లారు. అక్కడ ప్రయాణానికి బైక్ అద్దెకు తీసుకున్నారు. ఒప్పందం ప్రకారం.. బైక్‌ను సమయానికి తిరిగి అప్పగించినప్పటికీ.. బైక్ అద్దెకు ఇచ్చినవాళ్లు అదనంగా రూ.200 చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. దీంతో ఎందుకు చెల్లించాలంటూ వారు.. బైక్ అద్దెకు ఇచ్చిన వారిని ప్రశ్నించారు. ఈ విషయంలో ఇరువురు మధ్య వాగ్వాదం తలెత్తింది.. ఈ క్రమంలో పనాజీ బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న కొంతమంది బైక్ అద్దెకు ఇచ్చే వ్యక్తులు గుంపుగా వచ్చి జంటపై దాడికి పాల్పడ్డారు. దాడిలో హైదరాబాద్ వ్యక్తి తలకు గాయాలపాలయ్యారు. గర్భిణి అయిన మహిళకు ముఖం తీవ్రంగా ఉబ్బిపోయింది. గాయాలైన జంటను వెంటనే గోవా మెడికల్ కాలేజ్‌కి తరలించారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి ఘటనలు గోవాలో పర్యాటకుల భద్రతపై ప్రశ్నలు రేపుతున్నాయి. పోలీసులు పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుల కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా గోవాలో జరిగిన గొడవలో ఏపీకి చెందిన ఓ యువకుడు మరణించిన విషయం తెలిసిందే.. ఇలాంటి ఘటనల నేపథ్యంలో గోవాకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండటం మంచిదని పోలీసులు చెబుతున్నారు.

# నిరుద్యోగులకు గుడ్‌న్యూస్

## ఆర్టీసీలో నోటిఫికేషన్

హైదరాబాద్,ఆగస్టు9సమయజ్యోతి:

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు టీజీఎస్ఆర్‌టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. హైదరాబాద్ శివారులోని హకీంపేట్‌లో ఐటీఐ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎనిమిది, పదో తరగతి విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కాలేజీలో మోటార్ వెహికల్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్‌లలో కోర్సులు అందిస్తున్నట్లు తన ప్రకటనలో పేర్కొంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆగస్టు 28వ తేదీలోగా అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించింది. ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు మరింత సమాచారం కోసం 9100664452, 6302649844, 040-69400000 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. ఈ మేరకు టీజీఎస్‌ఆర్టీసీ సూచనలు చేసింది. మెకానిక్ డీజిల్, వెల్డర్ కోర్సులు ఏడాది వ్యవధిలో పూర్తయ్యే కోర్సులు. ఇక మెకానిక్ (మోటర్ వెహికల్), పెయింట్ కోర్సులు రెండేళ్ల వ్యవధితో అందిస్తున్నారు. వెల్డర్, పెయింటర్ కోర్సులకు ఎనిమిదో తరగతి విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సులకు ఏడాదికి రూ.16,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలోని ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు పరీక్షల ఫలితాలు మరో రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. తొలుత ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేయనున్నారు. అనంతరం 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేస్తారు. అలాగే స్టాఫ్ నర్సు పోస్టుల మెరిట్ జాబితా కూడా విడుదల చేసి, 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు వైద్య నియామక బోర్డు ఏర్పాట్లు చేస్తుంది.



# గిల్ కొన్నిసార్లు అగ్రెసివ్ అయ్యాడు

## ఇంగ్లాండ్ సిరీస్‌లో గీత దాటాడు టీమ్ఇండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్





రోహిత్ శర్మ టెస్టుల నుంచి రిటైరైన తర్వాత టీమ్ఇండియా మేనేజ్?మెంట్ 25ఏళ్ల యంగ్ బ్యాటర్ శుభ్?మన్ గిల్?కు కెప్టెన్సీ పగ్గాలు అందించింది. అతడి నాయకత్వంలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన భారత్ అద్భుతమైన ఆటతీరుతో ఆకట్టుకుంది. ఐదు మ్యాచ్?ల చెస్టు సిరీస్?ను 2-2తో సమం చేసుకొని పర్యటనను ఘనంగా ముగించుకుంది. ఈ పర్యటనలో గిల్ బ్యాటింగ్?తోపాటు కెప్టెన్సీలోనూ ఆకట్టుకున్నాడు. సంప్రదాయ టెస్టు ఫార్మాట్?లో జట్టును అగ్రెసివ్?గా ముందుకు నడిపించాడు. పలుమార్లు తనను రెచ్చగొట్టిన ప్రత్యర్థులకు అదే రీతిలో జవాబిస్తూ, తాను ఏం తక్కువ కాదని గట్టి రిప్లై ఇచ్చాడు. అలాగే కీలక ఆటగాళ్లు గాయాల పాలైనా, అందుబాటులో ఉన్న ప్లేయర్లతో జట్టను సమర్థంగా నడిపిచి కెప్టెన్సీలోనూ మాజీల ప్రశంసలు అందుకున్నాడు. ఈ సిరీస్?లో కామెంటేటర్?గా వ్యవహరించిన టీమ్ఇండియా మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ కూడా శుభ్?మన్ కెప్టెన్సీని మెచ్చుకున్నాడు. ముఖ్యంగా కెప్టెన్?గా గిల్ ఇంగ్లీష్ మీడియాను హ్యాడింల్ చేసిన విధానం అద్భుతం. చాలా బాగా మాట్లాడాడు" అని కార్తిక్ అన్నాడు.అలాగే ఈ సిరీస్?కు వచ్చేనాటికి గిల్ టెస్టు యావరేజ్ 30ల్లోనే ఉంది. దీంతో జట్టులో అతడి స్థానంపైనా విమర్శలు వచ్చాయి. కానీ ఇంగ్లాండ్ పర్యటన?లో శుభ్?మన్ గిల్? టాప్ స్కోరర్?గా నిలిచాడు. 10 ఇన్నింగ్స్?ల్లో 75.40 యావరేజ్?తో 754 పరుగులు చేసి ఔరా అనిపించాడు. అయితే ఈ పర్యటనకు అతడు బాగా ప్రిపేరయ్యే వచ్చాడని కార్తిక్ అన్నాడు. "ఈ సిరీస్ ప్రారంభం కాకముందు, ప్రెస్?మీట్?లో గిల్ చెప్పిన మాట గుర్తుందా?. ప్రస్తుత సైకిల్?లో భారత్ ఇప్పటివరకు 5 మ్యాచ్?లు ఆడగా అందులో 2 విజయాలు, 2 ఓటములు ఉన్నాయి. మరో టెస్టు డ్రా చేసుకుంది. 100 శాతం పర్సెంటేజీతో ఆస్ట్రేలియా టాప్?లో ఉండగా, శ్రీలంక 66.66 పాయింట్ పర్సెంటేజీతో రెండో ప్లేస్?లో కొనసాగుతోంది.

# టీమ్ఇండియా కెప్టెన్ ఇప్పటికే

# ప్రాక్టీస్ షురూ

## ఆసియా కప్‌కు సిద్ధమవుతోన్న టీమ్ఇండియా





2025 ఆసియా కప్ ఎడిషన్ సెప్టెంబర్? నెలలో ప్రారంభం కానుంది. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 9న ప్రారంభమై అదే నెల 28న ఫైనల్‌తో ముగుస్తుంది. ఈసారి భారత్ డిఫెండింగ్ ఛాంపియన్? హోదాలో బరిలోకి దిగుతోంది. అలాగే ఈ ఏడాది కూడా టైటిల్ లక్ష్యంగా బరిలో దిగనుంది.ఈసారి ఆసియా కప్ ప్రత్యేకంగా అలరించడానికి సిద్ధమవుతోంది. గతంలో ఈ టోర్నమెంట్‌లో కేవలం 6 జట్లే ఉండగా, ఈసారి మొత్తం 8 జట్లు పాల్గొంటున్నాయి. భారత్?, పాకిస్థాన్?తోపాటు, శ్రీలంక, బంగ్లాదేశ్, ఆఫ్గానిస్థాన్, హాంకాంగ్, ఒమన్, యుఏఈ జట్లు పాల్గొంటున్నాయి. భారత్? టైటిల్ ఫేవరెట్?గా ఉంది. అందుకు తగ్గట్లే టీమ్ఇండియా కెప్టెన్ ఇప్పటికే ప్రాక్టీస్ షురూ చేసేశాడు.టీమ్ఇండియాకు గుడ్?న్యూస్. గాయం కారణంగా కొన్ని రోజులు ఆటకు దూరంగా ఉంటూ వస్తున్న, టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇటీవల విదేశాల్లో హెర్నియా సర్జరీ సక్సెస్?ఫుల్?గా చేయించుకున్నాడు. అయితే రికవరీకి టైమ్ పడుతుందని, దీంతో అతడు రానున్న ఆసియా కప్?లో ఆడడం కష్టమని వార్తలు వచ్చాయి. తానీ, సూర్య ఆల్రెడీ గాయం నుంచి రికవరీ అయినట్లు తెలుస్తోంది. అంతేకాదు తాజాగా సూర్య తాజాగా నెట్స్?లో ప్రాక్టీస్ కూడా మొదలుపెట్టేశాడు. దీంతో అతడు అతను ఆసియా కప్‌లో ఆడటం ఖాయంగా కనిపిస్తుంది. దీనికి సంబంధించిన ఫొటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టీమ్ఇండియాకు గుడ్ డేస్ అంటూ ఫ్యాన్స్ కామెంట్లు పెడుతున్నారు.2026 టీ20 ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈసారి ఆసియా కప్‌ను పొట్టి ఫార్మాట్‌లోనే నిర్వహించాలని ఆసియా క్రికెట్ కౌన్సిల్ నిర్ణయించింది. 2023లో వన్డే ఫార్మాట్?లో జరిగిన ఈ టోర్నీ ఈసారి టీ20 ఫార్మాట్లో అలరించనుంది. దీంతో స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇందులో ఆడే ఛాన్స్ లేదు.ఐపీఎల్?లో ఇప్పటివరకు 166 మ్యాచ్‌లు ఆడిన సూర్య 35 సగటుతో 4311 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 29 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఇందులో 168 సిక్సర్లు కొట్టాడు. సూర్యకుమార్ యాదవ్ ఫిబ్రవరిలో ఇంగ్లాండ్‌తో జరిగిన తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. దీని తర్వాత ఐపీఎల్‌లోనూ పాల్గొన్నాడు.ఈ టోర్నీలో భారత్ తొలి మ్యాచ్?లో సెప్టెంబర్ 10న ఆతిథ్య యూఏఈతో తలపడాల్సి ఉంది. ఈ మ్యాచ్?తోనే భారత్ జర్నీ ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్?కు దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికకానుంది. తర్వాత సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో హై వోల్టేజ్ మ్యాచ్ ఉంది. ఇక సెప్టెంబర్ 19న అబుదాబిలోని షేక్ జాయెద్ క్రికెట్ స్టేడియంలో ఒమన్‌తో మూడో మ్యాచ్ ఆడనుంది టీమ్ఇండియా.

# యశస్వి జైస్వాల్ మరో వీరేంద్ర సెహ్వాగ్

## జైస్వాల్ బ్యాటింగ్ తీరు అందరి దృష్టిని ఆకర్షించింది

### ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్





భారత టెస్ట్ జట్టు ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఇటీవల రెండు సెంచరీలతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా ఇంగ్లండ్ జట్టుతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో జైస్వాల్ బ్యాటింగ్ తీరు అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ అద్భుతమైన ఆటతీరుకు గానూ యశస్వి జైస్వాల్ మరోసారి వార్తల్లో నిలిచారు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ యశస్వి జైస్వాల్‌ను ఎంతగానో ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ.. యశస్వి జైస్వాల్ బ్యాటింగ్ చూసినప్పుడు తనకు వీరేంద్ర సెహ్వాగ్ గుర్తుకు వస్తారని అన్నారు.భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన 5 టెస్టుల సిరీస్‌లో భాగంగా.. ఐదో టెస్ట్ మ్యాచ్‌ను మైఖేల్ క్లార్క్ సమీక్షిస్తూ యశస్వి జైస్వాల్‌ను అభినందించారు. ఈ మ్యాచ్‌లో యశస్వి జైస్వాల్ రెండో ఇన్నింగ్స్‌లో 118 పరుగులు చేశారు. ఈ ఇన్నింగ్స్‌తో టీమిండియా ఇంగ్లండ జట్టు ముందు 374 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఈ మ్యాచ్‌లో భారత జట్టు 6 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఈ విజయంపై మైఖేల్ క్లార్క్ మాట్లాడుతూ.. "మొదటి రోజు పిచ్ చూసిన తర్వాత ఈ మ్యాచ్ ఐదు రోజుల పాటు జరుగుతుందని ఎవరూ ఊహించి ఉండరు. మొదటి ఇన్నింగ్స్‌లో రెండు జట్లు కూడా మంచి స్కోరు సాధించడానికి చాలా కష్టపడ్డాయి." అని అన్నారు.మైఖేల్ క్లార్క్ ఇంకా మాట్లాడుతూ.. "మొదటి ఇన్నింగ్స్‌లో పిచ్ చాలా పచ్చగా ఉంది. కానీ రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 396 పరుగులు సాధించడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ పరిస్థితులు మెరుగయ్యాయి. కానీ యశస్వి జైస్వాల్ ఆడిన తీరు అద్భుతం. రాబోయే కాలంలో అతను ఒక సూపర్ స్టార్ అవుతాడని నేను భావిస్తున్నాను. క్రికెట్‌లో ఎన్నో ఘనతలు సాధిస్తాడు. జైస్వాల్ బ్యాటింగ్ నాకు వీరేంద్ర సెహ్వాగ్‌ను గుర్తు చేస్తుంది." అని మైఖేల్ క్లార్క్ పేర్కొన్నారు.సెహ్వాగ్ బ్యాటింగ్‌ను గుర్తుచేసుకుంటూ మైఖేల్ క్లార్క్ మాట్లాడుతూ.. "వీరేంద్ర సెహ్వాగ్ క్రీజులో ఉన్నప్పుడు అతడిని ఆపడం అసాధ్యం. ఇప్పుడు యశస్వి జైస్వాల్ బ్యాటింగ్‌లో కూడా అలాంటి మెరుపులు కనిపిస్తున్నాయి. అతను ఒక అద్భుతమైన ఆటగాడు, చాలా ప్రతిభావంతుడు" అని మైఖేల్ క్లార్క్ ప్రశంసించారు.

# మళ్లీ మైదానంలోకి కోహ్లీ!




టీమిండియా రన్ మెషీన్‌గా పేరు పొందిన విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియా పర్యటనకు ముందు తన శిక్షణను ప్రారంభించాడు. టెస్ట్, టీ20 క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత విరాట్ కోహ్లీ కేవం వన్డే, ఐపీఎల్‌పై మాత్రమే దృష్టి సారిస్తున్నాడు. ఆస్ట్రేలియా పర్యటనకు సన్నద్ధమయ్యే క్రమంలో కోహ్లీ తన ప్రాక్టీస్‌ను లండన్‌లో మొదలుపెట్టాడు. గుజరాత్ టైటాన్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ నయీమ్ అమీన్ పర్యవేక్షణలు కోహ్లీ ఈ శిక్షణ తీసుకున్నాడు.విరాట్ కోహ్లీ తన శిక్షణా సెషన్‌కు సంబంధించిన ఒక ఫోటోను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశాడు. ఆ పోస్టులో "సహాయం చేసినందుకు ధన్యవాదాలు బాయ్.. మిమ్మల్ని కలవడం ఎప్పుడూ ఆనందంగా ఉంటుంది." అంటూ నయీమ్ అమీన్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. అమీన్ కూడా కోహ్లీ పోస్ట్‌ను తన అకౌంట్‌లో రీ-షేర్ చేస్తూ.. "మిమ్మల్ని కలిసినందుకు సంతోషంగా ఉంది, బ్రదర్! త్వరలో మళ్లీ కలుద్దాం." అని పేర్కొన్నాడు.కోచ్ నయీమ్ అమీన్ బర్క్ షైర్, బకింగ్‌హామ్‌షైర్, లండన్‌లలో 'మైటీ విల్లో అకాడమీ'ని నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన సన్‌రైజర్స్ హైదరాబాద్ కోచింగ్ స్టాఫ్‌లో కూడా పనిచేశారు. విరాట్ కోహ్లీతో పాటు భారత ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా గతంలో అమీన్ అకాడమీలో శిక్షణ తీసుకున్నాడు.కోహ్లీ తన టెస్ట్, టీ20 కెరీర్‌కు వీడ్కోలు పలికిన తర్వాత, ప్రస్తుతం కేవలం వన్డే ఫార్మాట్, ఐపీఎల్ మ్యాచ్‌లపైనే దృష్టి పెట్టాడు. ఇప్పటివరకు 302 వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లలో 14,181 పరుగులు సాధించాడు. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2025 ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్‌పై 43 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడి, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తమ తొలి ట్రోఫీని గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. కోహ్లీ ఆటను చూడాలని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే వారు అక్టోబర్ వరకు వేచి ఉండాల్సి ఉంటుంది. వాస్తవానికి భారత్ ఆగస్టులో బంగ్లాదేశ్‌తో మూడు వన్డేలు ఆడాల్సి ఉంది. కానీ బీసీసీఐ, బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు పరస్పర అంగీకారంతో ఈ సిరీస్‌ను సెప్టెంబర్ 2026 వరకు వాయిదా వేశారు.

# కాంతార టీమ్‌ను వెంటాడుతున్న విషాదాలు


రిషబ్ శెట్టి దర్శకత్వంలో రూపొందుతున్న 'కాంతార చాప్టర్?1' సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటినుంచే టీమ్‌ను అనేక ప్రమాదాలు, విషాద సంఘటనలు కలవరపెడుతున్నాయి. తాజాగా, ప్రముఖ కన్నడ నటుడు టి. ప్రభాకర్ కళ్యాణి గుండెపోటుతో మరణించారు. ఉడిపిలోని హిరియడ్కలోని తన నివాసంలో ఆయన కుప్పకూలి చనిపోయారు. ఆయనకు గుండెకి సంబంధించిన చికిత్స జరిగినట్టు సమాచారం. కొద్ది రోజుల క్రితం ఆయన కళ్లు తిరిగి పడిపోవడంతో ఆసపత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. చికిత్స తర్వాత బాగానే ఉన్నా, హఠాత్తుగా గుండెపోటు రావడంతో కన్నుమూసారు.గత కొద్ది రోజులుగా కాంతార ఛాప్టర్ 1మూవీకి సంబంధించిన ఎవరో ఒకరు ఇలా కన్నుమూస్తుండడం ఆందోళన కలిగిస్తుంది. కాంతార చాప్టర్ 1 సినిమా షూటింగ్ ప్రారంభమైనప్పటి నుంచీ వరుసగా ప్రమాదాలు, విషాద సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. గత నవంబర్‌లో జూనియర్ ఆర్టిస్టులను తీసుకెళ్తున్న వ్యాన్‌కి ప్రమాదం జరగడంతో చాలా మందికి గాయాలు అయ్యాయి.ఆ తర్వాత మళయాళీ జూనియర్ ఆర్టిస్ట్ కపిల్ (33) నదిలో మునిగి చనిపోవడం, హాస్యనటుడు రాకేష్ పూజారి (33) గుండెపోటుతో మరణించడం వంటి సంఘటనలు చిత్ర బృందాన్ని కలవరపరిచాయి. ఇటీవల కళాభవన్ నిజూ కూడా గుండెపోటుతో మరణించినట్టు శాండల్ వుడ్ వర్గాలు తెలిపాయి. మరోవైపు కర్ణాటక రాష్ట్రం శివమొగా జిల్లా మణి జలాశయంలో షూటింగ్ జరుగుతున్న సమయంలో బోటు తిరగబడి నటుడు-దర్శకుడు రిషబ్ శెట్టితో పాటు 30 మంది నీటిలో పడిపోయినట్టు ఇటీవల వార్తలు చ్చాయి. అయితే, హెూంబాలే ఫిలింస్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఆదర్శ్ ఈ వార్తలను ఖండిస్తూ.. గాలి వాన వల్ల సెట్ కూలింది తప్ప ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు అని ఆయన తెలియజేశారు. గతంలో కూడా గాలి వాన వలన కాంతార టీమ్ వేసిన భారీ సెట్ కుప్పకూలింది. ఆ సమయంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే మూవీ రిలీజ్‌కి దగ్గర పడుతున్న సమయంలో ఇలాంటి ఘటనలు టీమ్‌ని టెన్షన్‌కి గురి చేస్తుంది.

ఈ సినిమాకోసం హీరో కమ్ డైరెక్టర్ రిషబ్ శెట్టి చాలా హార్డ్ వర్క్ చేశాడు. ప్రత్యేకమైన యుద్ధ కళను కూడా నేర్చుకున్నాడు, భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా రేంజ్ లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 2 విడుదల చేయబోతున్నారు.





# మాస్ రవితేజ టీజర్ వచ్చేసింది..




మాస్ మహారాజ కథానాయకుడు రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. శ్రీలీల కథానాయికగా నటిస్తుంది. ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగష్టు 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ మొదలుపెట్టింది చిత్రయూనిట్. నేడు రాఖీ పండుగా సందర్భంగా మూవీ నుంచి టీజర్ అప్‌డేట్‌ను పంచుకున్నారు మేకర్స్. ఈ మూవీ టీజర్‌ను ఆగష్టు 11న ఉదయం 11.08 గంటలకు విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది.

# కే రాంప్ నుంచి పాట విడుదల



యువ నటుడు కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కే రాంప్. హాస్య మూవీస్ బ్యానర్‌లో వస్తున్న ఈ సినిమాను రాజేశ్ దండా నిర్మిస్తుండగా.. జైన్స్ నాని దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. మలయాళ బ్యూటీ 'యుక్తి తరేజా' ఈ సినిమాలో కథానాయికగా నటిస్తుంది. లవ్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ సినిమాకి చైతన్య భరద్వాజ్ సంగీతం అందిస్తున్నాడు. అక్టోబర్ 18న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా నుంచి తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ ఓనం పాటను విడుదల చేశారు మేకర్స్. 'ఇన్‌స్టా ఆపేశాను.. ట్విటర్ మానేశాను..' సోషల్ మీడియా నేపథ్యంలో సాగిన ఈ పాట ప్రస్తుతం వైరల్‌గా మారింది.



# నిహారిక ఎమోషనల్ పోస్ట్

గా డాటర్ నిహారిక కొణిదెలకు ఇది రాఖీ పౌర్ణమి సమ్ థింగ్ స్పెషల్. ఎందుకంటే ఆమెకు ఇది డబుల్ ట్రీట్ ను అందించిన రోజు. పెదనాన్న మెగా స్టార్ చిరంజీవి కొడుకు రామ్ చరణ్‌తోనూ, సొంత అన్న వరుణ్ తేజ్ (తోనూ నిహారిక ఫోటోలను పెడుతూ తన మనసులోని మాటలను ఎమోషనల్ గా పోస్ట్ చేసింది. ఈ రాఖీ పండగ తనకు మరింత ప్రేమను అందిస్తోందని నిహారిక పేర్కొంది. తనకు ఎల్లప్పుడు అన్నయ్య చెర్రీ, వరుణ్ ఇద్దరూ వన్ స్టాప్ సొల్యూషన్స్ అని మనసులో మాట చెప్పింది. ఆ అన్నలిద్దరికీ చెల్లిగా అనిపించుకోవడం గ్రేట్ గా ఉంటుందని నిహారిక పేర్కొంది. ఇక ఈ రక్షాబంధన్ రోజునే నిహారిక మరో గుడ్ న్యూస్ ను గుర్తు చేసుకుంది. సరిగ్గా ఏడాది క్రితం ఆగస్ట్ 9వ తేదీనే నిహారిక నిర్మించిన 'కమిటీ కుర్రోళు ్ళ' సినిమా జనం ముందుకు వచ్చింది. అందరూ కొత్తవాళ్ళతో ఆమె నిర్మించిన ఈ సినిమా కమర్షియల్ గా సక్సెస్ కావడమే కాకుండా అవార్డుల పంటనూ పండించింది. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన గద్దర్ అవార్డులలోనూ రెండింటిని ఈ సినిమా గెలుచుకుంది. ఉత్తమ జాతీయ సమైక్యత, మత సామరస్యం, సామాజిక అభ్యున్నతి చిత్రంగా 'కమిటీ కుర్రోళ్ళు' ఎంపికైంది. అలానే ఉత్తమ నూతన చిత్ర దర్శకుడిగా యదువంశీ గద్దర్ అవార్డు ను అందుకున్నారు. రివార్డులు, అవార్డులు తన చిత్రానికి దక్కడంతో నిహానిక వెంటనే మరో సినిమాకు శ్రీకారం చుట్టింది.



# చాన్సుల కోసం అందాల ఆరబోత

ఉప్పెన సినిమాతో మెగాస్టార్ మనసు దోచిన ఈ బ్యూటీ.. చిరు ఆన్ స్టేజ్ చెప్పినట్టు.. ఇండస్ట్రీలో ఎక్కడికో వెళ్లిపోతుందని అందరూ అనుకున్నారు. కానీ చివరికి ఎక్కడికీ పోకుండా సినిమా అవకాశాలే లేకుండా.. మిగిలిపోయారు. వరుస ప్లాప్‌లతో సతమతమవుతూ.. మేకర్స్ వైపు అవకాశం కోసం ఆశగా చూసే వరకు పరిస్థితి తెచ్చుకున్నారు. అయితే ఇలాంటి ఈ సిట్యువేషన్‌లో.. కృతి షెట్టి ఓ ఫోటో షూట్‌తో కాస్త బోల్డ్ గా కనిపించారు. తాను హద్దులు దాటేందుకు రెడీ అన్నట్టుగా మేకర్స్ కు హింట్ ఇచ్చారు. ఆ ఫోటోలతో నెట్టింట కూడా తెగ వైరల్ అవుతున్నారు. కానీ అవే ఫోటోలతో మేకర్స్ మైండ్‌లో రిజిస్టర్ అయ్యారా? లేదా అనేది ఇక్కడ పాయింట్. పాన్ ఇండియా సినిమాలు.. మార్కెట్ అంచనాలు.. ప్రేక్షకుల నాడీని పట్టుకోడాలు.. ఓ సినిమా తెరకెక్కించేందుకు.. ఆ సినిమాలో ఆర్టిస్టులను క్యాస్ట్ చేసేందుకు... ఇలాంటి అంశాలనుపట్టుకునే మేకర్స్ ఇప్పుడు ఈమె బోల్డ్ ఫోటోలను చూసి ఛాన్స్ ఇస్తారా? లేక టూ లేట్ అంటూ.. లైట్ తీసుకుంటారా? అనేది ఇక్కడ పాయింట్. అయితే మేకర్స్ పాయింట్ ఆఫ్ వ్యూను పక్కక పెడితే.. ఇప్పుడు అందాలు ఆరబోసి ఏం లాభం అనేది నెటిజన్స్ కామెంట్. ప్రస్తుతం సోషల్ మీడియా ఖాతాలలో గ్లామర్ ఫోజులతో మెంటలెక్కిస్తోంది ఈ వయ్యారి. ఈ అమ్మడు షేర్ చేసిన ఫోటోస్ చూసి షాకవుతున్నారు నెటిజన్స్. ప్రస్తుతం కృతికి తెలుగులో ఒక్క సినిమా ఛాన్స్ రావడం లేదు.

EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685